

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర **రాజముద్ర**

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 05.11.2025 | సంపుటి : 2 | సంచిక :271 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Wednesday | 05.11.2025 | volume : 2 | Issue : 271 | Pages : 8 | Cost : 2/-



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# జూబ్లీహిల్స్‌పై కాంగ్రెస్ జెండా

## జూబ్లీహిల్స్‌లో 30వేల మెజార్టీ

చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్

రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్

**జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు.**

హైదరాబాద్,నవంబర్ 4 : సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. అలాంటి -మిగతా 2 లో..





దేశంలో 54 శాతం జనాభాకు

# వ్యవసాయమే ఆధారం

**వ్యవసాయం మన జీవన విధానంలో భాగం**

దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది

149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం

అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



02

దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నోవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించుకోవడమేనని పేర్కొన్నారు.



## సిఎంతో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్,నవంబర్ 4(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం మర్యాదపూర్వక భేటీ అయింది. తెలంగాణలో ఎడబ్ల్యూఎస్ కు సంబంధించి ఆన్ గోయింగ్ డేటా సెంటర్స్ ప్రాజెక్టులు, విస్తరణ తదితర అంశాలపై సీఎం తో ప్రతినిధి బృందం చర్చించింది. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం స్పష్టం చేసారు. సమావేశంలో డేటా సెంటర్ గ్లోబల్ హెడ్ కెర్రీ పర్సన్, ఇన్ఫా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ విక్రమ్ శ్రీధరన్, అనురాగ్ కిల్నాని, తదితరులు పాల్గొన్నారు.





06

## ట్రంప్ సుంకాలపై న్యాయ విచారణ

సుప్రీంలో సవాల్ చేసిన వ్యాపారులు

నేడు విచారణ జరుగున్నట్లు వార్తలు



06

ప్రపంచంలో నెక్స్ట్ సూపర్ పవర్‌గా భారత్

ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్





06

అమెరికా హెచ్-1బీ వీసాల

## ప్రాసెసింగ్ పునరుద్ధరణ

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై

# కమిటీ

సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు

కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

హైదరాబాద్, నవంబర్ 4 : రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ -మిగతా 2 లో..



03

## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

సుమోటోగా కేసు నమోదు చేసిన మానవహక్కుల సంఘం

# కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారు

**సీగాచీ ఘటనపై హైకోర్టులో కేసు**

హైదరాబాద్,నవంబర్ 4 : సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సిగాచీ పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి -మిగతా 2 లో..





02

## ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు

జాబ్ క్యాలెండర్ హమీలతో మోసం

నిరుద్యోగులను నిండా ముంచారు

జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత

హైడ్రా పేరుతో

# పేదల ఇండ్లు గుల్ల

ఒక్క అవకాశం ఇవ్వడం వల్లే తెలంగాణ దివాలా

జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు





**రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు.**

హైదరాబాద్,నవంబర్ 4 : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి -మిగతా 2 లో..

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్

ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం

**తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు.**



హైదరాబాద్, నవంబర్ 4 : గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన -మిగతా 2 లో..





03

## తెలంగాణలో క్రీడా ప్రోత్సాహక విధానాలు

తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల వల్లనే పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు.



## జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజారిటీతో
# గెలవబోతున్నాం

(మొదటిపేజీ తరువాయి)

పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్‌అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్‌స్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవర్కైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

## వ్యవసాయం మన
# జీవన విధానంలో భాగం

(మొదటిపేజీ తరువాయి)

2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ది పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో
# బిజెపికి జనసేన మద్దతు

**హైదరాబాద్, నవంబర్ 4 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డికి జనసేన పార్టీ అధికారికంగా మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జనసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డిలతో హైదరాబాద్‌లోని సాగర్ సొసైటీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహా ఇరుపార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ భేటీలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని విజయవంతం చేయడానికి జనసేన పార్టీ పూర్తిస్థాయి సహకారం అందించనున్నట్లు శంకర్ గౌడ్ తెలిపారు. రేపు రెండు పార్టీల నాయకులు సంయుక్తంగా ప్రెస్ మీట్ నిర్వహించి, తమ సంయుక్త ప్రచార కార్యాచరణ వివరాలను వెల్లడించనున్నారు. ఈ నిర్ణయం జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## సుక్మా జిల్లాలో
# భారీగా డంప్ స్వాధీనం

**హైదరాబాద్, నవంబర్ 4 :** ఇటీవల లొంగుబాట్లు, ఎన్‌కౌంటర్ల తరవాత పోలీసులు చేపట్టిన గాలింపులు మావోలకు చెందిన భారీ ఆయుధ దంపు లభించింది. సుక్మా అడవుల్లో భద్రతా దళాలు చేపట్టిన ఓ ఆపరేషన్‌లో మావోయిస్టుల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకున్నాయి. జిల్లాలోని గోంగూడ -కంచాల అడవుల్లో బలగాలు మంగళవారం కూంబింగ్ చేస్తున్న క్రమంలో మావోయిస్టుల ఆయుధ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గుర్తించాయి. భద్రతా బలగాలు ఆ ప్రాంతం నుంచి 17 రైఫిల్స్, రాకెట్ లాంచర్లు , ఆయుధాల తయారీ సామగ్రి, పరికరాలను స్వాధీనం చేసుకున్నాయి. ఈ ఘటనను ఎస్పీ కిరణ్ చవాన్ ధ్రువీకరించారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వచ్చి చక్కటి జీవితాన్ని ప్రారంభించుకోవాలని ఎస్పీ సూచించారు. డీఆర్‌జీ వ్యూహాత్మక ఆపరేషన్‌ను ఆయన అభినందించారు. భారీగా లొంగుబట్ల తరవాత ఈ డంప్‌ను నిర్వహించేవారు లేకుండా పోయారని తెలుస్తోంది.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారిం చి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తి చేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారిం చనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

## ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణను
# దివాళా తీయించారు

(మొదటిపేజీ తరువాయి)

తెచ్చారని, ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా?

వైఎస్‌ఆర్ తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టేసిందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. విద్యా సంస్థలకు ఇవ్వాల్సిన రూ.10 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రూ.10 వేల కోట్ల బాకీలు అడిగితే కాలేజీలను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, కాలేజీలు మూయిస్తామంటూ బెదిరిస్తున్నారని ఆక్షేపించారు. "విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోయింది. విద్యార్థుల ఫీజులు కట్టలేని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తుందా? లక్షలాది మంది విద్యార్థుల ఫీజులు కట్టలేదు. పీఆర్‌సీ లేదు. ఉద్యోగుల బాధలను కూడా పట్టించుకోవడం లేదు. పింఛనర్లు రెండేళ్ల నుంచి బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. రేవంత్‌రెడ్డి నడుతున్నది సర్కారా.. బెదిరింపుల దర్బారా? కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారిని బెదిరించారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే జీతాల్లో 15 శాతం కోత పెడతా అంటున్నారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించని రేవంత్ జీతంలో కూడా కోత పెట్టాలి కదా! ఒక్క ఛాన్స్ ఇవ్వండని మళ్లీ అడుగుతున్నారు. ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రం భ్రష్టుపట్టింది. దొంగ ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలవాలని కాంగ్రెస్ చూస్తోంది. పదేళ్ల కేసీఆర్ పాలన బాగుందా..? రెండేళ్ల రేవంత్ పాలన బాగుందా? మళ్లీ కేసీఆర్ పరిపాలన రావాలంటే జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర మొదలు కావాలి. కరెంటు లేని పరిస్థితి నుంచి సమృద్ధిగా కరెంట్ ఉండేలా చేశాం. పదేళ్లపాటు కంటికి రెప్పలా హైదరాబాద్‌ను కాపాడాం. అభివృద్ధి, సంక్షేమంలో మనతో పోటీపడే సత్తా రేవంత్‌రెడ్డికి లేదు. మహిళలు, రైతులు, నిరుద్యోగులను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. భారత రాష్ట్ర సమితిని గెలిపించండి.. కాంగ్రెస్ గల్లాపట్టి పథకాలు అమలు చేయిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై
# ప్రభుత్వం కీలక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం బాగా పెరుగుతోంది. సమయానికి ప్రభుత్వం ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో.. కాలేజీ యాజమాన్యం తమ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తుంది. ఆ క్రమంలో కాలేజీ యాజమాన్యంతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. దీంతో వాయిదాల రూపంలో నగదు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం తెలుపుతోంది. అందుకు ఆ కాలేజీల యాజమాన్యం సానుకూలంగా స్పందించకుండా ఆందోళనలకు దిగింది.

# అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నవంబర్ 4 :** రాష్ట్ర మంత్రి అజారుద్దీన్‌కు ప్రభుత్వం శాఖ కేటాయించింది. అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణస్వీకారం చేసిన నాలుగు రోజులకు అజారుద్దీన్‌కు శాఖ కేటాయించారు. మొత్తంగా రాష్ట్ర కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. మరో రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీల ఓట్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చిన సంగతి తెలిసిందే. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ ముస్లింకు హోంశాఖ ఇచ్చారు. ఇప్పుడు కూడా హోంశాఖను నాకు కేటాయించి ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలి' అని అజారుద్దీన్ సీఎం రేవంత్‌ను కోరినట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. తనకు హోం శాఖ ఇస్తేనే



ముస్లిం మైనార్టీలు ప్రభుత్వాన్ని నమ్ముతారని, జూబ్లీహిల్స్ ఎన్నికల వేళ అనవసర చర్చలకు తావులేకుండా శాఖల కేటాయింపు వీలైనంత త్వరగా ముగించాలని అజారుద్దీన్ కోరినట్టు తెలిసింది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి తన వద్ద ఉన్న కీలక శాఖలు ఎవరికీ ఇచ్చేది లేదని, మైనార్టీ వెల్ఫేర్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాలని చెప్పినట్టు సమాచారం. జూబ్లీహి ల్స్‌లో ఓడినా పోయేదేమీ లేదు.. హోంశాఖ మాత్రం ఇంకొకరికి ఇచ్చే ప్రసక్తి లేదని తెగేసి చెప్పినట్టు ప్రచారం అవుతున్నది. ఆ మేరకే అజారుద్దీన్‌కు మైనార్టీ సంక్షేమ శాఖ, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ శాఖలు కట్టబెట్టినట్లు

## జాబ్ క్యాలెండర్
# హామీలతో మోసం

**ఆదిలాబాద్, నవంబర్ 4 :** జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరఫున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.





## రెండోదశ ఎన్నికల
# ఓటరు జాబితా సవరణ

### న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఈసీ

**న్యూఢిల్లీ, నవంబర్ 4 :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ పక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో(ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరే కిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## మణికొండలో రాజకీయ నేతల
# కాల్పుల కలకలం



**హైదరాబాద్, నవంబర్ 4 :** మణికొండ పంచవటి కాలనీలో మంగళవారం తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. ఎపికి చెందిన మాజీమంత్రి ప్రభాకర్ ఓ స్థల వివాదంలో గాల్లోకి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మణికొండ పంచవటి కాలనీలో తన స్థలాన్నీ ఖాళీ చేయాలని బాధితులను ప్రభాకర్ బెదిరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తుపాకీతో గాల్లోకి ప్రభాకర్ మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు వార్తలు వస్తున్నాయి. బాధితులను స్థలంలో నుంచి బయటకు గెంటేసి గేటుకి ప్రభాకర్ అనుచరులు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. అయితే, రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. హైదరాబాద్ రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కాల్పులకు సంబంధించి కీలక విషయాలు బయటకొచ్చాయి. కేఈ ప్రభాకర్, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుటుంబాల మధ్య రచ్చ కారణంగా ఈ గొడవ జరిగినట్లు తెలిసింది.వివరాల్లోకి వెళ్తే.. కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రభాకర్ కుమార్తెకు, నందీశ్వర్‌గౌడ్ పెద్ద కుమారుడు అభిషేక్ గౌడ్‌కు చాలాకాలం కిందట పెళ్లి జరిగింది. ఆ దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ గొడవల కారణంగా వారు విడాకులు తీసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. దీంతో తన కుమార్తెకు కట్నంగా ఇచ్చిన ప్లాట్ ఖాళీ చేయాలని అల్లుడు నందీశ్వర్ గౌడ్‌పై కేఈ ప్రభాకర్ ఒత్తిడికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో కేఈ ప్రభాకర్‌ను అభిషేక్ గౌడ్ గన్‌తో బెదిరించారు. తుపాకీతో గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ బెదిరింపులపై అక్టోబర్ 25వ తేదీన రాయదుర్గం పోలీసులకు కేఈ ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. అప్పట్నుంచి అభిషేక్ గౌడ్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో మణికొండలోని పంచవటి కాలనీలో అభిషేక్ గౌడ్ నివాసానికి వెళ్లిన పోలీసులు వెపన్ కోసం సెర్చ్ చేస్తున్నారు.

## సిగాచీ ఉల్లంఘనలపై
# హైకోర్టులో కేసు

(మొదటిపేజీ తరువాయి)

వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండ లం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించి ంది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నా రు' అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

# టిప్పర్ వేగంతోనే బస్సుకు ప్రమాదం

- టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాద కారణం
- దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయి
- చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డిజిపి



**హైదరాబాద్, నవంబర్ 4 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్‌ను మెకానిక్ ద్వారా పరిశీలిస్తున్నా మన్నారు. దాదాపు 40 మీటర్లు టిప్పర్ లాక్కెళ్లడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. ఈ ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో రైట్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే రోడ్డు మలుపు ఉంది కానీ.. అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని.. ఇది అందరి బాధ్యతగా చూడాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల కారణంగానే మ-రణిస్తున్నారని గుర్తు చేశారు. రోడ్డు మీద డ్రైవ్ చేసే వారు డిఫెన్స్ కండిషన్‌ను అంచనా వేసుకొని డ్రైవ్ చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రమాదాన్ని చేవెళ్ల ఏసీపీ విచారణ అధికారగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.




## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన

### సుమోటోగా కేసు నమోదు చేసిన మానవహక్కుల సంఘం

**హైదరాబాద్, నవంబర్ 4 :** రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మీడియా ఛానల్స్, పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కు కూడా నివేదిక సమర్పించాలని హెచ్ఆర్సీ ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని డీజీపీ శశిధర్ రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. కాగా... నిన్న(సోమవారం) తెల్లవారుజామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కంకర మొత్తం బస్సులో కుప్పగా పడిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

## ఓయూ హాస్టల్‌లో కల్తీ ఆహారం

### గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థుల ఆందోళన

**హైదరాబాద్, నవంబర్ 4 :** ఉస్మానియా యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కల్తీ ఆహారం పెడుతున్నారని ఓయూ విద్యార్థు లు నిరసన చేపట్టారు. దీంతో ఓయూలో పోలీసులు భారీగా మోహ రించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని గోదావరి హాస్టల్ వద్ద విద్యార్థులు నిరసన దిగారు. ఆహారం బాగాలేదని, నాణ్యత పెంచాలని కాంట్రాక్టర్‌కు విద్యార్థులు సూచించారు. కల్తీ ఆహారం తిని అనా రోగ్యానికి గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు, ఓయూ అధికారులకు వ్యతిరేకంగా విద్యార్థులు ఓయూ ప్రధాన రహదారిపై భోజనంతో కూడి పాత్రలతో నిరసనకు దిగారు. ఆహారం బాగాలేదని చెప్తే.. ఏం చేసుకుంటారో చేసుకోండి అని కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారని విద్యార్థులు పేర్కొన్నారు. నాణ్యత లేని కల్తీ ఆహారాన్ని పెడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

## తెలంగాణలో క్రీడా ప్రోత్సాహక విధానాలు

- అంతర్జాతీయ క్రీడా పోటీలకు వేదికగా హైదరాబాద్
- బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించిన మంత్రి వాకిటి




**హైదరాబాద్, నవంబర్ 4 :** తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రోత్సాహక విధానాల వల్లనే పలు జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు హైదరాబాద్ వేదికగా మారుతోందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన 'తెలంగాణ ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ 2025' బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహక విధానాన్ని అమలు చేస్తోంది. దాని ఫలితంగా హైదరాబాద్ మాత్రమే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ క్రీడా టోర్నమెంట్లు నిర్వహించే ప్రణాళిక ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్ బ్యాడ్మింటన్ క్రీడకు హబ్ లాంటిదే. దేశానికి అనేక బ్యాడ్మింటన్ ఛాంపియన్లను అందించిన ఘనత తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి దక్కిందని అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ విజయవంతంగా సాగేందుకు స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, గత రెండేళ్లలో అనేక మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించిన ఘనత సంస్థకు దక్కిందని తెలిపారు. పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ, ఈ టోర్నమెంట్ నిర్వహణలో స్పోర్ట్స్ అథారిటీ అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రారెడ్డి, రవీందర్, డా. రవితేజ, అనిత, సుజాత, పద్మావతి, స్పెషల్ ఆఫీసర్ భాష పి ఆర్. ఓ కాలేరు సురేష్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కన్నం మధు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు యువిఎన్ బాబు, వంశీధర్, లక్ష్మణ్, కె. శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయం

- రెండేళ్లలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణ విధ్వంసం
- రేవంత్ నోటి దురుసుతో కెసిఆర్‌పై అభాండాలు
- మండిపడ్డ మాజీమంత్రి నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 4 :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి ఖాయమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి జోస్యం చెప్పారు. సమైక్య పాలనలో తెలంగాణ రెండు తరాలు నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వంపై రెండేళ్లకే ఆశలన్నీ పటాపంచలయ్యా యన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి.. నీటి విలువ, నోటి విలువ తెలియదన్నారు. ఆయనకు జూబ్లీహిల్స్ ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో ఉప ఎన్నికల కోసం ప్రచారం చేస్తోన్నది సీఎం రేవంత్ రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఇష్టమెచ్చినట్లు మాట్లాడటమే సీఎం రేవంత్ రెడ్డికి తెలుసునని మండిపడ్డారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌పై కోపంతో మెత్తం వ్యవస్థను నాశనం చేస్తున్నా రంటూ రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్ల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి నల్గొండ తప్ప ఏమీ తెలియదని ఎద్దేవా చేశారు. పాలమూరు అల్లుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఆ జిల్లాలోని ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. 2014 ముందు వరకు ఎస్ఎల్బీసీని కాంగ్రెస్, టీడీపీలు ఎందుకు పూర్తి చేయ లేదని ఆ యా పార్టీల నేతలను మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఎస్ఎల్బీసీ విషయంలో అవాస్తవాలు చెప్తుందంటూ కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఉప ఎన్నిక నవంబర్ 11వ తేదీన జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోరు జరగనుంది. ఈ మూడు పార్టీలు తమ తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఈ ఎన్నికల్లో ప్రచార జోరు ఉపందుకొంది. ఆ పార్టీల అగ్రనేతలు సైతం రంగంలోకి దిగి.. తమ అభ్యర్థిని గెలిపించాలంటూ ఓటర్లకు సూచిస్తున్నారు. ఈ సందర్భంగా కీలక హామీలు గుప్పిస్తున్నారు. ఈ ఉప ఎన్నిక ఫలితం నవంబర్ 14వ తేదీన వెలువడనుంది.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

### కారును ఢీకొన్న ట్రక్కు.. ఆరుగురు దుర్మరణం

**లక్నో, నవంబర్ 4 :** ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా- ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢకొ?ట్టింది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ వేరే ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగింది అని ఆయన అన్నారు.

## డ్రగ్స్ పార్టీని భగ్నం చేసిన ఎస్‌వోటీ పోలీసులు

- నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు
- భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



**హైదరాబాద్, నవంబర్ 4 :** నగరంలోని గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో ఎస్ఎం లగ్జరి గెస్ట్ రూమ్, కో లివింగ్ గెస్ట్ రూమ్‌లో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని ఎస్‌వోటీ పోలీసులు భగ్నం చేశారు. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై మాదాపూర్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ల నుంచి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు చేశారని వెల్లడించారు. ప్రస్తుతం ఇద్దరు నైజీరియన్లు పరారీలో ఉన్నారని... వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. బెంగళూరు నుంచి డ్రగ్స్ తీసుకు వచ్చి తేజ లోకల్‌గా ఉన్న యువత, స్టూడెంట్‌లకు అమ్ముతారన్నారు. ఇప్పటివరకు అన్ని లావాదేవీలు కలెక్ట్ చేశామని.. నిందితులు రిమాండ్ చేసినట్లు చెప్పారు. పట్టుబడ్డ తేజ కృష్ణ ఆర్కిటెక్ట్ అని.. కడపకు చెందిన వ్యక్తిగా తెలిపారు. మొత్తం ఈ కేసులో 19 మంది ఉన్నారు..వారి 9 మంది ఫెడ్లర్లు ఉన్నారన్నారు. పరారీలో ఉన్నవారిలో నలుగురు ఫెడ్లర్లు ఉన్నారని చెప్పారు. తేజ కృష్ణపై గతంలో మూడు ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని డీసీపీ ఉదయ్ రెడ్డి వెల్లడించారు. మాదాపూర్ ఎస్ఓటీ గచ్చిబౌలి పోలీసులు ఎస్ఎం కో లివింగ్ హాస్టల్లో రైడ్ నిర్వహించారని తెలిపారు. కో లివింగ్ హాస్టల్‌లో తేజ కృష్ణ, లోకేష్ రెడ్డి వద్ద డ్రగ్స్ లభించాయని చెప్పారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మరో నలుగురు.. హోటల్ నైట్ ఐలో దొరికారన్నారు. వారిని అదుపులోకి తీసుకున్నామని.. వారి వద్ద కూడా డ్రగ్స్ లభించినట్లు తెలిపారు. మొత్తం ఈ కేసులో 13 మందిని అరెస్ట్ చేశామని.. మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు చెప్పారు. అరెస్ట్ అయిన వారిలో ఆరుగురు ఫెడ్లర్లు, ఐదు మంది కన్స్యూమర్లు ఉన్నారన్నారు.

## చిన్నారితో అసభ్య ప్రవర్తన..

### డ్యాన్స్ మాస్టర్ అరెస్టు

**హైదరాబాద్, నవంబర్ 4 :** నగరంలోని బోయిన్‌పల్లి పీఎస్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్ బోయిన్‌పల్లిలో సుబ్బు డాన్స్ స్టూడియో నిర్వాహకుడు జ్ఞానేశ్వర్ నాలుగేళ్ల చిన్నారితో అసభ్యంగా ప్రవర్తించాడు. గత రెండు నెలలుగా తన వద్ద డ్యాన్స్ నేర్చుకునేందుకు వస్తున్న బాలిక పట్ల స్టూడియోలో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ నేపథ్యంలో కొన్నాళ్లుగా డ్యాన్స్ స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తుండటంతో.. చిన్నారిని తల్లిదండ్రులు ప్రశ్నించగా అసలు విషయం బయటకువచ్చింది. జ్ఞానేశ్వర్.. స్టూడియోలో చిన్నారిపై లైంగిక వేధింపులకు గురి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తల్లిదండ్రులకు చెప్పడంతో వెంటనే బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి.. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. జ్ఞానేశ్వర్‌ను రిమాండ్‌కు తరలించడంతోపాటు స్టూడియోను సీజ్ చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పాఠశాలలోనే చిన్నారులకు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి డ్యాన్స్ స్టూడియోలకు పంపే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

## వైద్యుడి ఇంట్లో రూ.3 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత

**హైదరాబాద్, నవంబర్ 4 :** ముషీరాబాద్‌లో ఓ వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. దాదాపు మూడు లక్షల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ముగ్గురు యువకులతో కలిసి జాన్ పాల్ అనే డాక్టర్ ఢిల్లీ, బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి అమ్మకాలు సాగిస్తున్నారు. ముషీరాబాద్‌లో ఓ ఇంట్లో ఉంటూ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతున్నాడు. పక్కా సమాచారంతో డాక్టర్ ఇంట్లో సోదాలు జరిపిన ఎక్సైజ్ ఎస్టీఎఫ్‌బీ బృందానికి భారీగా డ్రగ్స్ లభించింది. వైద్యుడి ఇంట్లో డ్రగ్స్‌ను చూసి ఎక్సైజ్ పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు స్నేహితులు కలసి డ్రగ్స్ దందా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ప్రమోద్, సందీప్, శరత్ అనే యువకులు.. బెంగుళూరు, ఢిల్లీ నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి.. డాక్టర్ జాన్‌పాల్ నివాసంలో పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇందుకు డాక్టర్ సహకరించాడు. డాక్టర్ స్వయంగా డ్రగ్స్ వాడటంతో పాటు వాటిని అమ్మకాలు జరుపుతున్నట్లు ఎస్టీఎఫ్ టీం గుర్తించింది. డ్రగ్స్ దందాపై సమాచారం అందిన వెంటనే ఎస్టీఎఫ్ బృందం డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో సోదాలు నిర్వహించారని.... ఈ సోదాల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడినట్లు ప్రదీప్ తెలిపారు. డాక్టర్ జాన్ పాల్ ఇంట్లో ఓజి కుష్, ఎండిఎంఎ, ఎల్ఎస్‌డి బాస్ట్స్, కొకైన్, గుమ్మస్, హాసిస్ ఆయిల్‌ను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ రూ. మూడు లక్షలు ఉంటుందని తెలిపారు. అయితే డ్రగ్స్ తెప్పిస్తున్న ప్రమోద్, సందీప్, శరతులు ప్రస్తుతం పరారీలో ఉండగా.. వీరిపై కూడా కేసు నమోదు అయ్యింది.

## బీహార్ ఎన్నికల్లో వివాదాస్పద వ్యాఖ్యలు

### కేంద్రమంత్రి లలన్ సింగ్ పై కేసు నమోదు



**పాట్నా,నవంబర్ 4 :** బిహార్ ఎన్నికల ప్రచారంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి, జేడీయూ నేత లలన్ సింగ్ పై పాట్నా జిల్లా యంత్రాంగం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వీడియా నిఘా టీమ్ నుంచి ఫుటేజ్‌ను సమీక్షించిన అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే కారణంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, ప్రజాప్రాతినిధ చట్టం కింద లలన్ సింగ్‌పై అధికారులు కేసు నమోదు చేశారు. మొకామా ప్రాంతంలో జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ తరఫున లలన్ సింగ్ ఇటీవల ప్రచారంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా పోలింగ్ రోజున విపక్ష నేతలను ఇళ్ల నుంచి బయటకు రానీయరాదని, ఇళ్లకు తాళాలు వేయాలని సూచించారు. నాయకులను ఓటు వేయకుండా అడ్డుకోవాలని, వాళ్లు ఒకవేళ రచ్చచేస్తే ఓటు వేయడానికి తీసుకు వెళ్లి తిరిగి ఇంటికే పరిమితం చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా, కేంద్ర మంత్రి మాట్లాడిన వీడియోను ఆర్జేడీ ప్రతినిధి ప్రియాంక భారతి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఎన్నికల కమిషన్‌ను బలహీనపరిచేలా లలన్ సింగ్ చర్యలు ఉన్నాయని, బహిరంగంగా ఓటర్లను కేంద్ర మంత్రి బెదిరిస్తుంటే ఈసీ ఎందుకు మౌనంగా ఉందని ఆమె ప్రశ్నించారు. మొకామాలో ఇటీవల దులార్ చంద్ యాదవ్ అనే జన్‌సురాజ్ కార్యకర్త హత్యకు గురికావడంతో అనంత్ సింగ్‌ను పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన బేవుర్ జైలులో ఉన్నారు.

## శ్రీవారికి వెండి గంగాళం వితరణ

### హైదరాబాద్ భక్తుడి విరాళం

**తిరుమల, నవంబర్ 4 :** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కొండకు తరలి రావడం, స్వామిని దర్శించుకుని విరాళాలు అందించడం జరగుతోంది. ప్రతీరోజు కొన్ని వేల మంది ఆ గోవిందుడిని దర్శించుకుంటారు. అంతేకాకుండా ఎవరి స్తోమత బట్టి వారు స్వామికి విరాళాలు ఇస్తుంటారు. వజ్రాలు, బంగారం, వెండితో చేసిన ఆభరణాలు, వస్తువులు.. లేదా పెద్ద మె-ంత్తంలో నగదును విరాళంగా అందజేసి ఆ శ్రీవారిపై తమ భక్తిని చాటుకుంటారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు కుటుంబంతో కలిసి శ్రీవారికి భారీ వెండి గంగాళాన్ని విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అనే భక్తుడు (మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి రూ.30 లక్షలు విలువ చేసే 22 కేజీల వెండి గంగాళాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు ఆలయ అధికారులకు గంగాళాన్ని భక్తుడు తన కుటుంబసభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

## రేగా ఉడత బెదిరింపులకు భయపడేది లేదు

- వందకోట్ల బేరంతో దొరికిన అసలు తెలంగాణ ద్రోహి
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విమర్శలు



**భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 :** మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ నాయకులు గానీ కార్యకర్తలు కానీ భయపడే పరిస్థితులు లేవని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులో 100 కోట్ల బేరసారాలు ఆడి అడ్డంగా దొరికిన తెలంగాణ ద్రోహి రేగా అని, ఆయనకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యాలయానికి సంబంధించిన చరిత్రను వివరించారు. స్థలం దానంగా ఇచ్చినప్పటి నుంచి భూమి పూజ, ప్రారంభోత్సవంతో పాటు ఇంటి పన్నుల వివరాలు అందరికీ తెలుసని, వాటి రశీదులు, కరెంటు బిల్లులు, అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని తెలిపారు. 2009లో రెడిమెడ్‌గా వచ్చిన నాయకుడు రేగాకు నియోజకవర్గ దిక్కులు కూడా తెలియవని, నాడు అతడిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ గెలిపిస్తే బేరసారాలు చేసి ఫార్టీ ఫిరాయించిన సంగతి అందరికీ తెలుసునన్నారు. ఆయన పార్టీ మారుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శక్తితో కట్టుకున్న భవనాన్ని కబ్జా చేశాడని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత నాయకులు, కార్యకర్తలు మన ఆఫీసును మనం స్వాధీనం చేసుకుందామని అన్నా.. తాను సముదాయించానన్నారు. కానీ ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఆఫీసుకు వెళ్లిన సమయంలో బీఆర్ఎస్ వారు తమ వారిపట్ల వ్యవహరించిన తీరు ఉద్రిక్తతకు కారణమైందన్నారు. రేగా కాంతారావు రెచ్చగొట్టగా.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారని, దాన్ని తమ పార్టీ వారు ప్రతిఘటించారన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు చేసిన చర్యను తాను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే పాయం తెలిపారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ.. మణుగూరులో కాంగ్రెస్ పార్టీ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ మారిన రేగా తర్వాత తెలంగాణ భవన్‌గా మార్చాడని, ఆభవనం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆస్తి అని అన్నారు. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకుశిరస్సు వంచి నమస్కారాలు తెలియజేసుకుంటున్నానని పొదెం వీరయ్య తెలిపారు. రేగా మాటలు ఆయన విజ్ఞతకే వదిలే స్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నియోజకవర్గ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాక్‌ను ఎగదోసే పనిలో ట్రంప్!



**ట్రంప్‌కు పిచ్చిపట్టిందని ఎవరైనా అనుకుంటే పొరపాటే..ఎందుకంటే ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ఆయన చర్యలు కేవలం భారత్‌ను టార్గెట్ చేస్తున్నవిగా గుర్తించాలి. భారత్ ఆర్థికంగా ఎదగడం ఒక ఎత్తయితే..సైనికపాటవంలో అమెరికాను ధిక్కరించే స్థాయికి చేరుకుంటుందన్న భయం కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆపరేసన్ సిందూర్‌లో భారత్ సైనిక పాటవం అజేయంగా నిలిచింది. పాక్‌కు అమెరికా ఇచ్చిన యుద్ధవిమానాలను కూడా తుత్తినియలు చేసింది. ఇదే ప్రధాన కారణంగా ట్రంప్‌ను నిద్రలేకుండా చేస్తోంది. అందుకే ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్‌ను ఏకాకిని చేయాలన్న బలమైన సంకల్పంతో తీసుకున్నవేనని గుర్తించాలి. అన్నింటికి మించి పాక్‌ను బూచిగా చూపి బెదిరించాలన్న ధోరణి బాగా కనిపిస్తోంది.**

భారత్‌తో సమానంగా పాక్‌ను కూడ చేర్చి రెండు అణ్వాయుధ దేశాలు అంటూ పదేపదే వ్యాఖ్యానించారు. ఇప్పుడు పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందన్నారు. దంతా కూడా పాక్‌లో పాగావేసి, అక్కడి నుంచి అవసరమైతే భారత్, చైనాలపై దాడులకు దిగాలన్న కుయక్తులు పన్నుతున్నారు. అందుకే భారత్ వ్యతిరేక చర్యలకు ట్రంప్ స్పీడ్ పెంచారు. సుంకాలు కావచ్చు.. వీసాలు కావచ్చు, అక్కడ అనధికారికంగా ఉన్నవారిని వేధించి, వెక్కరించి తిప్పిపంపడం కావచ్చు..ఉద్యోగాల్లో భారీతయులను తొలగించాలన్న డిమాండ్ కావచ్చు..ఇవన్నీ కూడా ఆపరేషన్ సింధూర్ తరవాత తీసుకున్న గట్టి నిర్ణయాలుగా చూడాలి. తాజాగా అణ్వాయుధ పరీక్షలు చేస్తామని చెప్పడం ద్వారా పాక్ కూడా అ÷–వాయుధాలు పరీక్షిస్తోందని చెప్పడం కూడా కేవలం భారత్‌ను బెదిరించే చర్య తప్ప మరోటి కాదు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆదివారం నాడు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని, అయినా పెంచుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తునప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కేవలం పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందని చెప్పడంలో మతలబు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో పుతిన్, జిన్‌పింగ్ చాలా కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మ–రోసారి వ్యాఖ్యానించారు.

ఇప్పటికే ట్రంప్ మీద స్వదేశంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది. విదేశాల్లో కుట్రలు చేస్తున్నారని, భారత్ లాంటి మిత్రదేశాన్ని దూరం చేసుకుంటున్నారని మండిపడు తున్నారు. ఇవేవీ ఆయన పట్టించుకోవడం లేదు. అంతెందుకు న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు కేటాయించను. ఎందుకంటే న్యూయార్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. ఇలా రాజకీయంగా కూడా ట్రంప్ అమెరికాలో విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఇదే అవకాశంగా అణ్వాయు ధాలపై వ్యాఖ్యలు చేసింది. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయు ధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు.

అమెరికా చేస్తున్న అణు పరీక్షలను సమర్థించుకున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నా యన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. ఇప్పుడు పరిస్థితులు మారాయని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణుసామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిందిగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొత్తంగా అమెరికా అణుపరీక్షల వ్యవహారం ఎలా ఉన్నా రష్యాచ,చైనాల సరసన పాక్‌ను కూడా చేర్చడం వెనక భారత్‌ను బెదరించే ధోరణిని ట్రంప్ ప్రకటించారు. ఎందుకంటే పాక్‌ను బల్లెంగా ఎగదోసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నాడని గుర్తించాలి. అందువల్ల ట్రంప్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ

- సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ
- మద్దతు ధరలకు అదనంగా 300, 400 చెల్లింపులు
- సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు
- మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్



**పాట్నా, నవంబర్ 4 :** బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వియాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ.300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామినిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పున జమ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యక్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఎ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై–బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్లు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధరతో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగర్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహీన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం. ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు, సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగట్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వి అన్నారు.

## ఆందోళన కలిగిస్తున్న
# వరుస ప్రమాదాలు
### పలు కుటుంబాల్లో తీరని విషాదాలు




**హైదరాబాద్, నవంబర్ 4 :** ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారుతున్నాయి. గత వారం కర్నూలు జిల్లాలో వేమూరి కావేరి బస్సు ప్రమాదంలో 19 మంది సజీవ దహనమైన విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం తెల్లవారుజామున మూడు ట్రావెల్స్ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాల య్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లా చెన్నే కొత్తపల్లి మండలం దామరాజు పల్లి దగ్గర జబ్బార్ ట్రావెల్స్ బస్సు ఓ ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో బెంగుళూరుకు చెందిన ఓ మహిళ మరణించగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్ వస్తోంది. మృతురాలు బెంగళూరుకు చెందిన వారిగా గుర్తించారు. మ–రోవైపు.. ఏలూరు జిల్లా లింగపాలెం మండలం జూబ్లీనగర్‌లో భారతి ట్రావెల్స్‌కి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి. ఆయా ఘటనలపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే సోమవారం తెల్లవారు జామున చేవెళ్లలో జరిగిన ప్రమాదంలో 19మంది దుర్మరణం చెందారు. చేవెళ్లలో తెల్లవారక ముందే బస్సెక్కిన 19 మంది ప్ర యాణికుల బతుకులు తెల్లారేలోగా కానరానిలోకాలకు మరలిపోయాయి. గమ్యస్థానాలకు చేరుకోక ముందే తమ వారికి దూరమయ్యా రు. క్షేమంగా వెళ్లొచ్చని ఆర్టీసీ బస్సు ఎక్కిన వారికి కంకర టిప్పర్ రూపంలో మృత్యుశకటం ఎదురొచ్చి ప్రాణాలనే బలి తీసుకున్నది. నిద్రలో ఉన్నవారు కొందరు శాశ్వత నిద్రలోకి జారిపోయారు. కర్నూలు జిల్లా చిన్నటేకూరు సమీపంలో ట్రావెల్స్ బస్సు అగ్నిప్రమాదానికి గురై 19 మంది సజీవ దహన మైన ఘటనను మరువకముందే రంగారెడ్డి జిల్లా చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ గేట్ వద్ద సోమవారం తెల్లవారుజామున మరో ఘోర రోడ్డు ప్రమా దం జరిగింది. ఈ దుర్ఘటనలో టిప్పర్, బస్సు డ్రైవర్లు ఇద్దరు సహా 19 మంది దుర్మరణం పాలయ్యారు. తాండూరు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన కంకర టిప్పర్ బలంగా ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకున్నది. హైదరాబాద్– బీజాపూర్ హైవేపై చేవెళ్ల నుంచి వికారాబాద్‌కు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ (టీజీ 06టీ3879) వాహనం ఎదురుగా అతి వేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టి, దానిపై పూర్తిగా ఒరిగిపోయింది. దానిలో ఉన్న కంకరమొత్తం బస్సులోకి జా రింది. దీంతో ఆర్టీసీ బస్సు కుడివైపున 8 వరుసల సీట్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ఆ సీట్లలో కూర్చున్న కొందరు ప్రయాణికులు బలమైన గాయాలతో మరణించగా, మరికొందరు కంకరలో కూరుకుపోయి ఊపిరాడకవి లవిల్లాడుతూ చనిపోయారు.



## ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు
### నలుగురికి గాయాలు

**నల్లగొండ, నవంబర్ 4 :** చేవెళ్లలో ఘోర బస్సు ప్రమాద ఘటన మరవక ముందే మరో యాక్సిడెంట్ జరిగింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి–నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ట్రావెల్స్ బస్సు ఆంధ్రప్రదేశ్‌లోని కావలి నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## యథావిధిగా జెఎన్‌టియూ ఫార్మసీ పరీక్షలు

**హైదరాబాద్, నవంబర్ 4 :** ఫీజు రియింబర్స్‌మెంట్ నిధుల కోసం ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు చేపట్టిన బంద్ నేపథ్యంలో హైదరాబాద్‌లోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీకల్ యూనివర్సిటీ కీలక ప్రకటన చేసింది. మంగళవారం నుంచి ప్రారంభం కావాల్సిన బీ ఫార్మసీ ఫస్టియర్ పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని వీసీ కే వెంకటేశ్వర్ రావు ప్రకటించారు. ఉదయం ప్రారంభం కావాల్సిన ఎగ్జామ్స్ కొనసాగుతున్నాయని తెలిపారు. తదు పరి ఎగ్జామ్స్ కూడా నిర్వహిస్తామన్నారు. రూ.10వేల కోట్ల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు ఉండగా, ప్రస్తుతం రూ.5వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలని ప్రయివేటు కాలేజీల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం

- అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం
- హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం



**హైదరాబాద్/వరంగల్, నవంబర్ 4 :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లిడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

## మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**హైదరాబాద్, నవంబర్ 4 :** గత కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. రెండు నగరాల్లో వెండి రేట్ కిలోకు రూ.1,65,000 వద్ద కొనసాగుతోంది. మదపర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం, ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నానాటికీ సన్నగిల్లుతున్న ఆశలు, మళ్లీ పుంజుకున్న డాలర్ వెరసి బంగారం ధరలను తగ్గిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.



## మాజీ మంత్రి హరీష్ రావును కలిసి సానుభూతి తెలిపిన
# గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు తండ్రి తన్నీరు సత్య నారాయణరావు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించిన విషయం విదితమే, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం రోజున హైదరాబాద్ కొకపేట లోని వారి నివాసంలో హరీష్ రావును కలిసి దివంగత తన్నీరు సత్య నారాయణరావు చిత్ర పటానికి పుష్పంజలి ఘటించి హరీష్ రావుకి సానుభూతిని తెలియజేసిన తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ సదానందం గౌడ్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల మల్లేష్ గౌడ్, ఇతర గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సీనియర్ జర్నలిస్టు సత్యంకి మాతృవియోగం

### నివాళులు అర్పించిన జర్నలిస్టులు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** తిరుమలాయపాలెం మండల సీనియర్ జర్నలిస్ట్ చిరసవాడ సత్యం మాతృమూర్తి నాగమ్మ అనారోగ్యంతో వారి స్వగృహంలో కన్నుమూశారు. మంగళవారం ప్రధాన పత్రికల సీనియర్ జర్నలిస్టులు ఆమె భౌతిక గాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.కుమారులు సత్యం, వెంకటేశ్వర్లును పరామర్శించి ఓదార్చారు.కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి,వారికి మనో ధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ భావాలు కలిగిన కలిగిన నాగమ్మ కుమారులను,కుమార్తెను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు.ఆమె మరణం కుటుంబానికి తీరని లోటని తెలిపారు.గ్రామస్తులు,బంధువుల అశ్రునయనాల నడుమ నాగమ్మ అంతిమయాత్ర కొనసాగింది. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఉబ్బని సుందర్,గోవింద వెంకట్, పప్పుల సుధాకర్,మేకల నాగరాజు,కూరపాటి విజయ్,గుజ్జ రామకృష్ణ, లంజపల్లి ప్రవీణ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.



# నష్టపోయిన పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి : పాగర్తి సుధాకర్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో నేలకొండపల్లి మండల వ్యవసాయ అధికారి గార్కి మోంథా తుఫాన్ వల్ల నష్ట పోయిన పంటను క్షేత్ర స్థాయిలో పర్శిలించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. మండలం లోని అన్ని గ్రామల్లో అకాల వర్షాలకు వరి పంట నష్ట పోయిన నేపథ్యంలో మండల మొత్తం క్షేత్ర స్థాయిలో పర్శిలించి, రైతులను ఆదుకోవాలి, అదేవిదంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ భీమా పథకం అమలుచెయ్యాలని ప్రభుత్వనికి నివేదిక పంపి నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బాజా రామకృష్ణ, ప్రచార కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, మండల నాయకులు సయ్యద్ మోహినుద్దీన్, కొండా హర్షవర్ధన్, పిట్టల సూరిబాబు, కందరబోయిన గోపి,గుండెపోంగు క్రాంతి, ఎలిగేటి నరసింహారావు, ఎలిగేటి వెంకటేష్, బానోత్ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు



## 12 గంటల్లో హత్య కేసు ఛేదించిన
# బాలానగర్ పోలీసులు

### నిందితుడిపై ఇంతకుముందే అటెంప్ట్ మర్డర్ కేస్

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** తనకు ఏమాత్రం పరిచయం లేని ఓ వ్యక్తి బూతులు తిట్టాడన్న ఆవేశంలో ఓ పాత నేరస్థుడు కత్తితో అతన్ని పొడిచి హత్య చేసిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం బాలానగర్ ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటి రెడ్డి, తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడెన్ మెట్ చౌరస్తా ఫుట్ ఓవర్ బ్రిడ్జి దగ్గర ఫుట్ పాత్ పక్కన కూర్చున్న మహమ్మద్ గఫర్(39) మద్యం మత్తులో ఉన్నాడు. అటుగా వెళ్తున్న గురుమూర్తి నగర్ కు చెందిన పాత నేరస్థుడు అయిన అజయ్ మధ్య మాటలు పెరిగి గొడవకు దారి తీసింది. అసభ్య పదజాలంతో తిట్టాడన్న ఆవేశంలో అజయ్ తన వద్ద ఉన్న కత్తితో మహ్మద్ గఫర్ చెవి, భుజంపై పొడిచి గాయపరిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతను అక్కడికక్కడే మరణించాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బాలానగర్ ఏసీపీ పింగళి నరేశ్ రెడ్డి, సీఐ టి.నర్సింహరాజు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సీసీ ఫుటేజీ పరిశీలించగా పాత నేరస్థుడు అజయ్ ఈ హత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడికి పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించి నిందితుడిని బాలానగర్ పోలీసులు కేవలం 12 గంటల్లోనే అరెస్ట్ చేసి కేసులు చేదించడం జరిగింది. అనంతరం ఎస్ఐ పి. సరిత రెడ్డి, పిసిలు అశోక్, శ్రీశైలం, ఇఫ్తేకర్, ఎలియాస్, మధుసూధన్, జకీర్, శ్రీనివాస్, నరేష్, హెడ్ కానిస్టేబుల్ మెరాజ్ రత్నయ్యలతో కలిసి ఈ కేసును విజయవంతంగా పూర్తి చేసిన వారి బృందానికి రివార్డ్ ఇస్తామని తెలిపారు.

## ఆపండి మహా ప్రభో
# మీ రాజకీయాలు

- ప్రభుత్వ నిర్లక్ష్యం నీడన వరుస రోడ్డు ప్రమాదాలు
- ఓవర్ లోడ్ రవాణాపై అధికారుల చర్యలేవీ...?
- ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్, ఆక్యూపెన్సీ లిమిట్ వద్దా...?
- ప్రభుత్వాలకు ప్రజల ప్రాణాలంటే లెక్కేలేదు
- ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివ శంకర్ మాదిగ



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీమంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరు ఒక్కొక్క కుటుంబానికి రూ. 10 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి/చేవెళ్ల ఇంచార్జి బ్యాతల శివ శంకర్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం రోజుచేవెళ్ల మండలంలోని మీర్జాపూర్ దగ్గర జరిగిన టిప్పర్, బస్సు ఢీ కొన్న దుర్ఘటన తనను తీవ్రంగా కలచి వేసిందని బ్యాతల శివ శంకర్ మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రోజు చేవెళ్ల ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ చేవెళ్ల మండల అధ్యక్షులు ఊరేంట ప్రవీణ్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బ్యాతల శివశంకర్ మాదిగ హాజరై మాట్లాడుతూ... వరుసగా జరుగుతున్న రహదారి ప్రమాదాలకు ప్రభుత్వ రవాణా వ్యవస్థ నిర్లక్ష్యమే కారణమని మండిపడ్డారు. అనేక సంవత్సరాలుగా రద్దీగా ఉండే బీజాపూర్ రహదారి విస్తరణ చేపట్టక వరుస ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా గత, ప్రస్తుత ప్రభుత్వాలు, ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ మంత్రులు తమకు ఏమి పట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఓవర్ లోడుతో వెళ్తున్న లారీలు, టిప్పర్లను రవాణా అధికారులు మామూళ్ల మాయలో పడి చూసి చూడనట్లుగా వదిలి వేయడం సామాన్య ప్రజల ప్రాణాలకు సంకటంగా మారిందని అన్నారు. ప్రభుత్వాల ఉచిత హామీల వల్ల ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే మహిళ ప్రయాణికుల సంఖ్య పెరగడం కారణంగాను, ఆర్టీసీ బస్సులకు ఫిట్నెస్ లేకపోవడం కారణంగాను, అధికారుల నిర్వహణ లోపం వల్ల బస్సుల్లో వరుస ప్రమాదాలు జరగడం బాధాకరం అన్నారు. నిన్నటి ఘటన 20 కుటుంబాలను చిన్నాభిన్నం చేసిందని, ఏమిస్తే ఆ కుటుంబాలకు న్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ప్రజల ప్రాణాలు అంటే విలువే లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని, వ్యవస్థలను గాడిలో పెట్టి ప్రజల ప్రాణాలను రక్షించాలని సూచించారు. అదే రోడ్డు విషయంలో నిర్లక్ష్యం వహించడం, రోడ్డు విస్తరణ చేయకుండా ఎమ్మెల్యేలు, ఎంపీలు పట్టించుకోకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. కాబట్టి ప్రమాదానికి ప్రజాప్రతినిధులు కారణం కాబట్టి ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి మృతుల కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరు, ఒక్కొక్క కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్గ్రేషియా ప్రకటించాలి డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ సమావేశంలో చేవెళ్ల గ్రామ అధ్యక్షులు కొజ్జంకి యాదయ్య, గుండాల అధ్యక్షుడు మల్లేష్, అల్లాడ అధ్యక్షుడు విజయ్ కుమార్, కందాడ అధ్యక్షుడు మహేందర్, గొల్లపల్లి అధ్యక్షుడు వెంకటేష్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొజ్జంకి ప్రసాద్, సత్యనారాయణ, మానయ్య శివ తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు
# ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాం

### జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మంగళవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యలయం లోని ఎంటీ సెక్షన్ (మోటార్ ట్రాన్స్పోర్ట్ సెక్షన్) లో విధులు నిర్వహిస్తూ, అకాల మరణం చెందిన హోంగార్డ్ అధికారి సిహెచ్. శ్రీనివాస్ కుటుంబ సభ్యులను జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి పరామర్శించి వారికి అండగా ఉంటామని పూర్తి భరోసా కల్పించారు. శ్రీనివాస్ హఠాత్తు మరణం తమను తీవ్రంగా కలచివేసిందని ఇది పోలీస్ శాఖకు కూడా తీరని లోటు అని ఎస్పీ పేర్కొన్నారు. మృతుని మరణానికి సంబంధించి ఉన్న అనుమానాలు, ఆందోళనలను దృష్టిలో ఉంచుకుని శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్న ప్రాంతంలో కరెంట్ షాక్‌కు గురై మరణించారా లేదా మరేదైనా ఇతర కారణంతో మృతి చెందారా అనే విషయంపై దర్యాప్తు జరుగుతోందని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కేసులో వాస్తవాలు తెలుసుకోవడానికి శాస్త్రీయ పద్ధతి అయిన పి ఎం ఈ (పోస్ట్ మార్టం ఎగ్జామినేషన్) తుది నివేదిక కీలకం అవుతుందని, ఆ నివేదిక వచ్చేవరకు ఎలాంటి ముందస్తు నిర్ధారణకు రావద్దని ఎస్పీ సూచించారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ఎవరూ కూడా అధైర్యపడకుండా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పోలీస్ డిపార్ట్మెంట్ తరపున ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటామని కేసు దర్యాప్తు విషయంలో, శాఖ పరమైన సాధ్యమైన అన్ని విధాలా సహకారం అందించడానికి తాము అందుబాటులో ఉంటామని కె. నారాయణ రెడ్డి వ్యక్తిగతంగా హామీ ఇచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, వికారాబాద్ ఇన్స్పెక్టర్ భీమ్ కుమార్, ఇతర అధికారులు కుడా పాల్గొని పరామర్శించారు.

## పుల్కల్ వరి కొనుగోలు కేంద్రాన్ని
# పరిశీలించిన ఇంచార్జీ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి




**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మంగళవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్ (ఇన్‌చార్జి) బిచ్కుంద మండలంలోని పుల్కల్ వద్ద కొనుగోలు సెంటర్‌ను సందర్శించి, కొనసాగుతున్న వరి సేకరణ కార్యక్రమాలను ప్రత్యక్షంగా సమీక్షించారు.సహకార శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుల్కల్ వద్ద కొనుగోలు సెంటర్ ద్వారా ఇప్పటివరకు 670 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి, నిర్ణీత రైస్ మిల్లులకు తరలించడం జరిగిందనీ అన్నారు.తనిఖీ సందర్భంగా జిల్లా కలెక్టర్ వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఎలాంటి నష్టం జరగకుండా సేకరించిన వరి ధాన్యాన్ని నిర్ణీత తేమ స్థాయికి చేరుకున్న వెంటనే రైస్ మిల్లులకు తరలించాలనీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే ఆన్‌లైన్ ట్యాబ్ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, మిల్లర్ రసీదులు సకాలంలో అందేలా చూడాలని, తద్వారా రైతులకు కొనుగోలు చేసిన 48 గంటలలోపే చెల్లింపులు జరగాలనీ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, సబ్ కలెక్టర్ బాన్సువాడ కిరణ్మయి, డి.సి.ఎస్.వో, డి.ఆర్.డి.వో, డి.సి.ఓ,డి. ఎం.సి.ఎస్, డి.ఎం.వో పాల్గొన్నారు.

## బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు
# వెంటనే ప్రారంభించాలి

- చనిపోయిన మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలి
- సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్




**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం రోజు సిపిఎం, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అప్ప జంక్షన్ నుండి మన్నెగూడ వరకు వెంటనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ... సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం అందరి హృదయాలను కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజాపూర్ జాతీయ రహదారిపై పడిన గుంతలను వెంటనే పూడ్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్జిటిలో స్టే తొలగిపోయిందని ప్రకటించిందని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు అనాథలు అయ్యారని, ఆ పిల్లల సంరక్షణ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిందన్నారు. మృతి చెందిన కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్గ్రేషన్ చెల్లించాలని, గాయపడిన వారికి పది లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు స్పందించి అప్పా జంక్షన్ నుండి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రోడ్డు వెంటనే పూర్తి అయ్యేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీశ్, సిపిఎం పార్టీ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్, అధ్యక్షుడు శ్రీనివాస్, సిఐటియు ట్రాన్స్పోర్ట్ యూనియన్ అధ్యక్షులు రమేష్, ప్రధాన కార్యదర్శి నవాజ్ కోశాధికారి శ్రీశైలం, ఉపాధ్యక్షులు వెంకట్రాములు, మహేందర్, ఊరెళ్ళ రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్
# ఇండ్లు కేటాయింపు

### అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఆన్ లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయింపు చేశామని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా అలాట్ చేసి మాట్లాడుతూ, నేడు జరిగిన అలాట్ మెంట్ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. రఘునాథపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో నిర్మించిన 48 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గతంలోనే లబ్దిదారుల ఎంపిక పూర్తి చేశామని, ప్రస్తుతం ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు జరుగుతుందని, ఏ లబ్దిదారుడికి ఏ నెంబర్ ఇండ్లు కేటాయించాలనే అంశం పూర్తి పారదర్శకంగా ఎటువంటి పైరవీలు లేకుండా ఆన్ లైన్ ద్వారా కేటాయించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల తహసీల్దార్ శ్వేత, ఆర్ఐ వహీద్, ఈడిఎం దుర్గా ప్రసాద్, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు..



# ప్రతి విద్యార్థిని యుడిఐఎస్ఈ ప్లెస్, ఓరియంటేషన్‌లో నమోదు చెయ్యాలి

### మండల విద్యాశాఖ అధికారి వేంకటేశ్వరరావు

**వాజేడు, రాజముద్ర న్యూస్:** వాజేడు నాగారం జడ్పీ హెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో యుడిఐఎస్ఈ ప్లెస్,ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. మండలంలో ఉన్నటువంటి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,విద్యార్థుల వివరాలను ఎటువంటి తప్పులు లేకుండా సరైన డేటాను ఇవ్వాలని,మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చూడాలని,ప్రతి విద్యార్థిని యుడిఐఎస్ఈ ప్లెస్ లో నమోదు చేయాలని సూచించారు. డిఎస్ఈ, ఎఫ్ఆర్ఎస్, ఉపాధ్యాయులు విద్యార్థుల హాజరు 100 శాతం నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఆధార్ లేని విద్యార్థులకు బయోట్రన్స్ అనే ఏజెన్సీ ద్వారా ఉచితంగా ఆధార్ నమోదు చేయటం జరుగుతుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎస్ ఆనందరావు, స్ట్రాంగ్ టీచర్ బి జయేంద్రరావు, ప్రధానోపాధ్యాయులు, మిస్కో నరేష్,సీఆర్పీ వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.



# యువత మత్తు పదార్థాలకి దూరంగా ఉండాలి

- తహసిల్దార్ రవి కుమార్
- హెల్పింగ్ హ్యాండ్స్, రీచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రగ్ నివారణ ర్యాలీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సమాజంలో ఆదర్శవంతమైన జీవితాన్ని కొనసాగిస్తూ ఉన్నతంగా జీవించాలని తహశీల్దార్ రవి కుమార్ అన్నారు.కూసుమంచి మండల కేంద్రంలో మంగళవారం హెల్పింగ్ హ్యాండ్స్,రీచ్ ఫౌండేషన్ ఆధర్యంలో డ్రగ్స్ నివారణ పై జాతీయ జెండాలు చేతబూని విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు మత్తు పదార్థాలకు,జల్సాలకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్ ను నిర్వీర్యం చేసుకోవద్దని సూచించారు.నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని,లక్ష్య సాధన కై శ్రమించాలని తెలిపారు.ఎంపీడీవో జశ్వంత్ కుమార్ మాట్లాడుతూ యువకులు తెలిసీ తెలియని వయసులో దురలవాట్ల బారిన పడి విలువైన జీవితాలను కొల్పోవద్దని తెలిపారు.ప్రధానంగా మత్తుని కలిగించే గంజాయి,సిగరేట్,నార్కోటిక్ డ్రగ్స్ కి దూరంగా ఉండాలని కోరారు.తల్లిదండ్రులు సైతం తమ పిల్లల కదలికలను నిశితంగా గమనించాలి సూచించారు.ఎస్సై నాగరాజు మాట్లాడుతూ యువత మత్తును కలిగించే పదార్థాల జోలికి పోవద్దని అన్నారు.మత్తు పదార్థాలను వినియోగించిన,రవాణా చేసిన పోలీస్ కేసు నమోదు కావడంతో పాటుగా చట్ట రీత్యా చర్యలు తీసుకోబడుతాయని తెలిపారు.ప్రధానంగా వివాదాలకు దూరంగా ఉండాలని,చిన్న గొడవలే పెద్దగా మారుతాయని తెలిపారు.అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సాయికుమార్, అధ్యాపకులు ఉదయ్, రాజేష్, రవీందర్, నరేందర్, వంశీ, నాగరాజు, వినోద్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచ మేధావి డా.బి.ఆర్. అంబేడ్కర్

### అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి

కామారెడ్డి, రాజముద్ర న్యూస్: నస్రుల్లబాద్ మండలంలోని అంకోల్ క్యాంప్ గ్రామంలో నేషనల్ హైవే – 765 రోడ్డు విస్తరణ పనుల ప్రభావం వల్ల తొలగించాల్సిన డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం పునఃస్థాపన విషయమై మంగళవారం అదనపు కలెక్టర్ రెవెన్యు విక్టర్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, డీఎస్పీ విట్టల్ , తహసీల్దార్ నస్రులాబాద్ కె. సువర్ణ, మాజీ సర్పంచ్ రాము, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రాజు, గ్రామ పెద్దలు స్థానిక ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.సమావేశంలో రోడ్డు విస్తరణ కారణంగా విగ్రహం తొలగించాల్సిన పరిస్థితులు వివరించగా గ్రామ ప్రజల అభిప్రాయాలను సేకరించారు. గ్రామంలో విగ్రహం పునఃస్థాపనకు అనువైన ప్రత్యామ్నాయ స్థలాన్ని కూడా గుర్తించి, అధికారులు గ్రామ పెద్దల తో చర్చించి అంబేడ్కర్ విగ్రహాన్ని గౌరవప్రదంగా కొత్త స్థలంలో ప్రతిష్ఠించడానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రజలు కూడా సహకరించనున్నట్లు హామీ ఇచ్చారు. అధికారులు సమన్వయంతో విగ్రహ పునఃస్థాపన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

# ప్రపంచంలో నెక్ట్స్ సూపర్ పవర్‌గా భారత్

## ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్



**ఫిన్లాండ్ :** ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ భారత్‌పై ప్రశంసలు కురిపించారు. అమెరికా, చైనాలతో పాటు ప్రపంచంలో తదుపరి సూపర్ పవర్‌గా భారత్ నిలవనుందన్నారు. ఇదే క్రమంలో ప్రపంచశక్తిగా ఎదుగుతోన్న భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించకపోవడాన్ని తప్పుబట్టారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లా డుతూ స్టబ్ ఈ వ్యాఖ్యలు చేశారు. తాను భారత్‌కు గొప్ప అభిమానినని పేర్కొన్నా రు. విదేశీ వ్యవహారాల్లో భారత్ అనుసరి స్తున్న విధానాలు సరైనవేనన్నా రు. ఈ సందర్భంగా యూఎన్ వంటి వేదికపై భారత్ వంటి దేశాల పాత్ర ఉండాలని స్టబ్ అన్నారు. యూఎన్ భద్రతా మండలిని విస్తరించాలని జనరల్ అసెంబ్లీలో రెండుసార్లు పేర్కొన్నట్లు వెల్లడిం చారు. అందులోని సభ్యత్వాలను పెంచాలన్నారు. భారత్ వంటి దేశాలకు శాశ్వత సభ్యత్వం లేకపోవడం సరైనది కాదన్నారు. లాటిన్ అమెరికా నుంచి ఒక సభ్యుడు, ఆఫ్రికా నుంచి ఇద్దరు.. ఆసియా నుంచి ఇద్దరు సభ్యులు ఉండాలని స్టబ్ సూచించారు. భారత్‌కు అందులో స్థానం లేకపోతే ఆ సంస్థ మరింత బలహీనపడుతుంది అని స్టబ్ అభిప్రాయపడ్డారు.

# ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించం : పాక్



**పాకిస్థాన్ :** రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు. అమెరికా చేస్తున్న అణు పరీక్షలను సమర్థించుకున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నాయన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. "రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణు పరీక్షలు నిర్వహిస్తున్నాయి. కానీ, వీటి గురించి ఆయా దేశాలు మాట్లాడట్లేదు. మేం అలా కాదు. ఏదైనా బహిరంగంగానే చేస్తాం. దాని గురించి మాట్లాడతాం. ఇన్నాళ్లూ ఎన్ని దేశాలు అణు పరీక్షలు చేపట్టినా మేం వాటి జోలికి వెళ్లలేదు. ఇకపై అలా మిగిలిపోవాలనుకోవట్లేదు. ఇతర దేశాల మాదిరిగానే మేమూ ఈ పరీక్షలు నిర్వహిస్తాం" అని ట్రంప్ వెల్లడించారు. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. ఇప్పుడు పరిస్థితులు మారాయని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణుసామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిందిగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# ఇజ్రాయెల్‌కు మద్దతిస్తే.. మా సహకారం ఉండదు

## అమెరికాకు తేల్చిచెప్పిన ఇరాన్



**ఇరాన్ :** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అమెరికాను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం ఆపేవరకు యూఎస్‌కు సహకరించేది లేదని తేల్చి చెప్పారు. టెహ్రాన్‌లో విద్యార్థులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ సహకరించాలని అమెరికన్లు కోరుకుంటున్నారని ఖమేనీ అన్నారు. అయితే ఇజ్రాయెల్ పాలనకు మద్దతు ఇవ్వడం పూర్తిగా ఆపేసేంత వరకు యూఎస్‌కు ఇరాన్ సహకరించదన్నారు. సైనిక స్థావరాలను తొలగించడంతో పాటు మధ్యప్రాచ్యంలో అగ్రరాజ్యం జోక్యం చేసుకోవడం ఆపేస్తే దానితో కలుస్తామన్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్ అహంకారంతో వ్యవహరి స్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాతో అణుచర్చలు తిరిగి ప్రారంభించడానికి తొందరపడటం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఇటీవల పేర్కొన్నారు. ఇదే క్రమంలో పరోక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# బంగ్లా పాఠశాలల్లో మ్యూజిక్, పీఈటీ టీచర్ల నియామకాలు బంద్

**బంగ్లాదేశ్ :** బంగ్లాదేశ్‌లోని పాఠశాలల్లో మ్యూజిక్, పీఈటీ టీచర్ల నియామకాలను రద్దు చేస్తున్నట్లు అక్కడి తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సంగీత, నృత్య ఉపాధ్యాయులను నియమించాలని అక్కడి విద్యా మంత్రిత్వశాఖ ఇటీవల నిర్ణయం తీసుకుంది. అయితే ఈ చర్యలను ఇస్లాం వ్యతిరేక అజెండాగా అభివర్ణించిన బంగ్లా ఇస్లాం ఛాందసవా దులు యూనస్ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడితెచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా సృష్టించిన మ్యూజిక్, పీఈటీ టీచర్ల పోస్టులను రద్దు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారి మసూద్ అక్తర్ ఖాన్ ప్రకటన విడుదల చేశారు. ఈ పోస్టులను రద్దు చేయడానికి గల కారణాలను మీడియా ప్రశ్నించగా.. ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. స్థానిక మీడియా వర్గాలు వెల్లడించిన కథనాల ప్రకారం.. యూనస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బంగ్లాలో ప్రభుత్వ నిర్ణయాల్లో ఇస్లాం ఛాందసవాదుల జోక్యం పెరిగిపోతోంది. ప్రభుత్వ నిర్వహణలోని ప్రాథమిక పాఠశాలల్లో కేవలం మతపరమైన ఉపాధ్యాయులనే నియమించాలని.. మ్యూజిక్, పీఈటీ టీచర్ల నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే వీధుల్లోకి వచ్చి నిరసన చేపడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారు.

# ట్రంప్ సుంకాలపై న్యాయ విచారణ

- సుప్రీంలో సవాల్ చేసిన వ్యాపారులు
- నేడు విచారణ జరుగున్నట్లు వార్తలు



**వాషింగ్టన్, నవంబర్ 4 :** అమెరికా చరిత్రలోనే అత్యంత కీలకమైన న్యాయవిచారణకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు సిద్ధమవుతోంది. టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలపై వాణిజ్య యుద్ధం సాగిస్తోన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారాలను నిర్ణయించే అంశంపై న్యాయస్థానం అమెరికా కాలమానం ప్రకారం బుధవారం విచారణ జరపనుంది. తాజాగా ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరపున సుప్రీంకోర్టులో వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి అధికారంలోకి రాగానే ట్రంప్ మిత్ర, శత్రు భేదం లేకుండా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై సుంకాలతో విరుచుకుపడిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికార చట్టాన్ని ఉపయోగించి ట్రంప్ ఈ సుంకాలు విధించారని అమెరికా సర్కారు తెలిపింది. అయితే, ఈ చట్టాన్ని వినియోగించే క్రమంలో అధ్యక్షుడు ఫెడరల్ చట్టాలను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ట్రంప్ నిర్ణయాన్ని కొన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా ప్రభుత్వం సుప్రీంకోర్టు ను ఆశ్రయించింది. దీనిపై బుధవారం విచారణ జరగనుంది. ఈ కేసులో ట్రంప్‌నకు వ్యతిరేకంగా భారత సంతతి అటార్నీ నీల్ కత్యాల్ వాదనలు వినిపించనున్నారు. దీంతో ఆయన పేరు ప్రస్తుతం అంతర్జాతీయ మీడియాలో మార్మోగుతోంది. 54 ఏళ్ల నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులను వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలున్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. ఈ కేసు విచారణకు ట్రంప్ ప్రత్యక్షంగా హాజరుకావాలని తొలుత భావించారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నారు. ప్రభుత్వం తరపున ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ హాజరుకానున్నారు. ఈ కేసు విచారణపై ట్రంప్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఇందులో మేం గెలిస్తే.. ప్రపంచంలోనే అత్యంత సంపన్న, సురక్షితమైన దేశంగా అమెరికా నిలుస్తుంది. ఒకవేళ ఓడిపోతే పేద దేశంగా మారుతుంది. అలా జరగొద్దని భగవంతున్ని కోరుకుంటున్నా అని రాసుకొచ్చారు.

# భారతీయ విద్యార్థి వీసాలను భారీగా తిరస్కరించిన కెనడా




**కెనడా :** కెనడాలో భారతీయ విద్యార్థి వీసాలు భారీగా తిరస్కరణకు గురయ్యాయి. ఉన్నతవిద్య చదివేందుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి నలుగురిలో ముగ్గురు విద్యార్థి వీసాలను కెనడా అధికారులు తిరస్కరించారు. కెనడా ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ గణాంకాల ప్రకారం.. 2025 ఆగస్టులో భారతీయ విద్యార్థులు చేసుకున్న దరఖాస్తుల్లో 74 శాతం తిరస్కరణకు గురయ్యాయి. 2023లో ఆ మొత్తం 32 శాతంగా ఉంది. ఇదే సమయంలో చైనా విద్యార్థి వీసాల తిరస్కరణ రేటు 24 శాతంగా ఉండగా.. మిగతా దేశాల సగటు రేటు 40 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. అంతర్జాతీయ విద్యార్థి వీసా కార్యక్రమాన్ని కఠిన తరం చేసేందుకు కెనడా ప్రయత్నాలు కొనసాగిస్తోన్న తరుణంలో ఈ భారీ తిరస్కరణలు పెరిగాయి. మరోవైపు భారత్ నుంచి దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోతోంది. విదేశీ విద్యకు అమెరికా తర్వాతి స్థానంలో ఉన్న కెనడా.. గతేడాది దాదాపు 10లక్షల మంది విదేశీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వీరిలో 41శాతం భారత్ నుంచే ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, వియత్నాం దేశాలు ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక భారీ స్థాయిలో విద్యార్థి వీసాల దరఖాస్తులను కెనడా తిరస్కరించడానికి అక్కడి స్థానిక పరిస్థితులే కారణమని ఇమిగ్రేషన్ నిపుణులు అంచనా వేస్తున్నారు. నివాస కొరత, మౌలిక సదుపాయాల కల్పన ఇబ్బందిగా మారడం, స్థానిక ఖర్చులు విద్యార్థులు భరించగలరా? అన్న విషయాలపై ఆందోళనల నేపథ్యంలోనే కెనడా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నారు. మరోవైపు అమెరికా, కెనడాలకు ప్రత్యామ్నాయం చూస్తున్న భారతీయ విద్యార్థులు జర్మనీ వైపు మొగ్గు చూపుతున్నట్లు మరో నివేదిక వెల్లడించింది.

# 'పాక్ సైన్యం ఓ కిరాయి మాఫియా'



**పాకిస్థాన్ :** పాకిస్థాన్ సైన్యంపై పాక్ జీ సింధ్ ముత్తహిదా మహాజ్ గ్రూపు ఛైర్మన్ షఫీ బుర్ఫాత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ దేశంలోని సైన్యం ఓ అవినీతి కిరాయి మాఫియా అని దుయ్యబట్టారు. అది డాలర్లు, ఇతర లాభాల కోసం అమ్ముడు-పోతుందని.. అది ఏ క్షణంలో అయినా యూకే, ఇతర ప్రపంచదేశాలను సులభంగా మోసం చేస్తుందన్నారు. ప్రచ్ఛన్న యుద్ధం నుంచి, ఉగ్రవాదంపై పోరాటం వరకు దశాబ్దాలుగా పాక్ సైన్యం అవకాశవాదాన్ని తన వ్యూహంగా అనుసరిస్తోందన్నారు. ఆ దేశం ఎప్పుడూ న్యాయం, విశ్వాసం, భావజాలం గురించి పోరాడలేదని.. కేవలం లాభాల కోసమే పోరాడిందన్నారు. సోవియట్-అఫ్గాన్ యుద్ధం సమయంలో కూడా ఇస్లామాబాద్ పాశ్చాత్య సహాయాన్ని సేకరించడానికి మాత్రమే తనను తాను జిహాద్ రక్షకుడిగా ప్రచారం చేసుకుందని విమర్శించారు. 9/11 దాడులు జరిగిన తర్వాత ఉగ్రవాదంపై అమెరికా చేస్తున్న యుద్ధంలో చేరినట్లు నటిస్తూనే పాకిస్థాన్ ఆ దాడులకు కుట్ర పన్నిన ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయమిచ్చిందని ఆరోపించారు. ఇలా అక్కడి ప్రభుత్వం, సైన్యం దశాబ్దాలుగా ప్రపంచ దేశాలను మోసం చేస్తోందన్నా రు. పాక్ సైన్యం వారికి బీజింగ్ ఎక్కువ మొత్తం చెల్లిస్తే.. వాషింగ్టన్‌కు ద్రోహం చేస్తుందని.. అమెరికా ఎక్కువ చెల్లిస్తే చైనాను కూడా అంతే సులభంగా మోసం చేస్తుందని బుర్ఫాత్ ఆరోపించారు. పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ పైనా తీవ్ర విమర్శలు చేశారు. మునీర్ ఒక నకిలీ ఫీల్డ్ మార్షల్ అ ని.. కాలం చెల్లిన సిద్ధాంతాలను ఇప్పటికీ పాటిస్తున్నారని దుయ్యబట్టారు. అతడి నేతృత్వంలోని పాక్ సైన్యం ఇప్పటికే ప్రపంచ దేశాల నమ్మకాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. డబ్బు కోసం తమ విశ్వాసాన్ని అమ్ముకునేవారిని ఏ దేశం నమ్మదన్నారు.

# అమెరికా హెచ్-1బీ వీసాల ప్రాసెసింగ్ పునరుద్ధరణ




**యూఎస్ :** అమెరికాలో షట్‌డౌన్ ఇంకా కొనసాగుతుంది. దీని నేపథ్యంలో ఇటీవల హెచ్1బీ వీసాల ప్రాసెసింగ్ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా దాన్ని పునరుద్ధరించారు. అమెరికా కార్మిక శాఖ ఈ విషయాన్ని ప్రకటించింది. అమెరికా కాంగ్రెస్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల సెప్టెంబర్ 30 నుంచి ఫెడరల్ ప్రభుత్వ సేవలు నిలిచిపోయాయి. దీని కారణంగా లేబర్ కండీషన్ అప్లికేషన్, ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్ దరఖాస్తులు ఆగిపోయాయి. తాజాగా తాత్కాలిక, శాశ్వత ఉపాధి కార్యక్రమాల కోసం వీసా దరఖాస్తుల ప్రాసెస్‌ను విదేశీ కార్మిక ధ్రువీకరణ కార్యాలయం తిరిగి ప్రారంభించిందని కార్మిక శాఖ తెలిపింది. అమెరికన్ కంపెనీలు దరఖాస్తులు ప్రారంభించవచ్చని వెల్లడించింది. గ్రీన్ కార్డుకు సంబంధించి ప్రాసెస్‌లు ప్రారంభించినట్లు వివరించింది. అమెరికా కార్మికశాఖ తాజా ప్రకటన ప్రభావం భారతీయ పౌరులపైనా పడనుంది. హెచ్-1బీ వీసా పొందేవాళ్లలో దాదాపు 70శాతం మంది భారతీయులు ఉన్నారు. తాజా ప్రకటన వారికి తీపి కబురే. దరఖాస్తు ప్రాసెసింగ్‌లు తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని చర్యలను ఓఎఫ్‌ఎల్‌సీ తీసుకొంటుందని తెలిపింది. ఈసందర్భంగా ఇప్పటికే ఉన్న అనేక దరఖాస్తుల విషయాన్ని ప్రస్తావించింది. వివిధ కంపెనీలు, సంస్థల నుంచి వచ్చే అభ్యర్థనలు పెరిగే అవకాశం ఉందని, దీంతో సాధారణ ప్రాసెసింగ్‌లకు ఎక్కువ సమయం పట్టవచ్చని పేర్కొంది.

# ఆయనను భారత్‌కు డిపోర్ట్ చేయొద్దు

## వేదం సుబ్రహ్మణ్యంకు అమెరికాలో ఊరట



**యూఎస్ :** చేయని నేరానికి నాలుగు దశాబ్దాల పాటు అమెరికా జైల్లో మగ్గి, ఆ తర్వాత నిర్దోషిగా విడుదలై ఇప్పుడు బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటోన్న భారత సంతతి వ్యక్తి వేదం సుబ్రహ్మణ్యంకు ఊరట లభించింది. ఆయనను అమె రికా నుంచి డిపోర్ట్ చేయొద్దని అగ్రరాజ్యా నికి చెందిన రెండు న్యాయస్థానాలు ఇమిగ్రేషన్ అధికారులను ఆదేశించాయి. 64 ఏళ్ల వేదం సుబ్రహ్మణ్యం ప్రస్తుతం లూసియానాలోని ఓ నిర్బంధ కేంద్రంలో ఉన్నారు. ఆయనను భారత్‌కు తిరిగి పం పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే సుబ్రహ్మణ్యం డిపోర్టేషన్‌పై ఇమిగ్రేషన్ జడ్జి స్టే విధించారు. ఆయన కేసును రివ్యూ చేయాలా, వద్దా అన్న దానిపై బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ అప్పీల్స్ నిర్ణయం తీసుకునేవరకు దేశం నుంచి బహిష్కరించొద్దని న్యాయమూర్తి ఆదేశించారు. అదే సమయంలో పెన్సిల్వేనియాలోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్ట్ కూడా ఇదేవిధమైన స్టే విధించింది. దీంతో దేశం నుంచి పంపించకుండా ప్రస్తుతానికి ఆయనకు ఊరట లభించినట్లయ్యింది.



# నైజీరియాలో క్రైస్తవులపై మారణహోమం

- ఇలాగే సాగితే జోక్యం చేసుకోక తప్పదు
- నైజీరియా ప్రభుత్వానికి ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, నవంబర్ 4 :** నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. అక్కడి వనరులపై ట్రంప్ కన్నుపడిందన్న ప్రచారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తువులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద మూఠాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకున్నా, క్రైస్తవులు కూడా మరణిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, రాగి, లాందనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.

## అదరగొట్టిన ఎస్‌బీఐ..

# లాభం రూ.20,160 కోట్లు

**ముంబయి:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్రైమాసిక ఫలితాల్లో రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో రూ.20,160 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో ఈ మొత్తం రూ.18,331 కోట్లుగా ఉంది. ఏడాదిలో 10 శాతం వృద్ధి నమోదైంది. సమీక్షా త్రైమాసికానికి ఎస్‌బీఐ మొత్తం ఆదాయం రూ.1,29,141 కోట్ల నుంచి రూ.1,34,979 కోట్లకు పెరిగింది. వడ్డీ ద్వారా వచ్చే ఆదాయం రూ.1,13,871 కోట్ల నుంచి రూ.1,19,654 కోట్లకు పెరిగింది. బ్యాంకుల ఆస్తుల నాణ్యత కూడా మెరుగైంది. సెప్టెంబర్ 30 నాటికి స్థూల నిరర్థక ఆస్తులు గతేడాదితో పోలిస్తే 2.13 శాతం నుంచి 1.73 శాతానికి తగ్గాయి. నికర మొండి బాకీలు 0.53 శాతం నుంచి 0.42 శాతానికి తగ్గుముఖం పట్టాయి. ఏకీకృత ప్రాతిపదికన ఎస్‌బీఐ గ్రూప్ 7 శాతం వృద్ధితో రూ.21,137 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. గతేడాది ఇదే సమయంలో ఈ మొత్తం రూ.19,743 కోట్లుగా ఉంది. మొత్తం ఆదాయం కూడా రూ.1.63 లక్షల కోట్ల నుంచి రూ.1.75 లక్షల కోట్లకు పెరిగింది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎన్ఎస్ఈలో ఎస్‌బీఐ షేర్లు స్వల్పంగా లాభపడి రూ.957 వద్ద ట్రేడవుతున్నాయి.









## భారీ నష్టాల్లో ముగిసిన
# స్టాక్ మార్కెట్ సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, విదేశీ మదుపర్ల అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్ స్టాక్స్ సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 500 పాయింట్ల మేర క్షీణించగా.. నిఫ్టీ 25,600 స్థాయికంటే దిగువన ముగిసింది. సెన్సెక్స్ ఈ ఉదయం 84,000.64 పాయింట్ల (క్రితం ముగింపు 83,978.49) వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,412.77 – 84,068.01 మధ్య కదలాడింది. చివరికి 519 పాయింట్లు నష్టపోయి 83,459.15 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 165.70 పాయింట్లు తగ్గి 25,597.65కి చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.66గా ఉంది. సెన్సెక్స్ 30లో పవర్ గ్రిడ్, ఎటెర్నల్, టీఎంపీవీ, టాటా స్టీల్, మారుతీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 63 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 3994 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## అప్పుడు ఒక్క మ్యాచ్ ఆడితే
# రూ.1,000 ఇచ్చారు
### దిగ్గజ బ్యాటర్ మిథాలి రాజ్

భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. తొలిసారి ఛాంపియన్‌గా అవతరించిన టీమ్‌ఇండియాకు బీసీసీఐ రూ.51 కోట్ల నజరానా ప్రకటించింది. అంతేకాకుండా భారత జట్టుకు ప్రైజ్‌మనీ కింద ఐసీసీ నుంచి రూ.39.87 కోట్లు దక్కనున్నాయి. అయితే, కొన్నేళ్ల క్రితం భారత మహిళా క్రికెటర్లకు మ్యాచ్ ఫీజులు కూడా లేవని దిగ్గజ బ్యాటర్ మిథాలి రాజ్ ఈ ఏడాది ఆరంభంలో ఓ ఇంటర్వ్యూలో అన్నారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు పరిస్థితి చాలా మారిందని ఆమె గుర్తు చేసుకున్నారు. మిథాలి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఇంతకీ ఆమె ఏమందంటే.. ఒకప్పుడు మాకు వార్షిక కాంట్రాక్ట్‌లు, మ్యాచ్ ఫీజులు లేవు. 2005 మహిళల ప్రపంచ కప్‌లో మేము రన్నరప్‌గా నిలిచినప్పుడు మాకు ప్రతి మ్యాచ్‌కు రూ.1,000 ఇచ్చారు. అది కూడా ఆ టోర్నమెంట్ వరకే. లేకపోతే మాకు మ్యాచ్ ఫీజులు లేవు. అప్పట్లో మహిళల క్రికెట్ నుంచి వచ్చే ఆదాయం తక్కువ. కాబట్టి మేం మ్యాచ్ ఫీజులు ఎక్కడి నుంచి పొందాలి? మహిళల క్రికెట్ అసోసియేషన్ బీసీసీఐలో విలీనం అయిన తర్వాత ఈ మ్యాచ్ ఫీజులు, వార్షిక కాంట్రాక్టులు ప్రారంభమయ్యాయి. మొదట మాకు సిరీస్‌కు ఇంత అని ఇచ్చేవారు. తర్వాత ఒక్కో మ్యాచ్‌కు వేతనం చెల్లించారు. ప్రస్తుతం పురుషుల జట్టుతో సమానంగా మహిళల టీమ్‌కు వేతనాలు ఇస్తున్నారు' అని మిథాలి రాజ్ ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 1973 నుంచి 2006 వరకు భారత్‌లో మహిళల క్రికెట్ కార్యకలాపాలను ఉమెన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించేది. నవంబర్ 2006లో ఇది బీసీసీఐలో విలీనం అయింది. గతంలో పురుష క్రికెటర్లతో పోలిస్తే మహిళా క్రికెటర్ల వేతనాలు తక్కువగా ఉండేవి. అక్టోబర్ 2022 నుంచి పురుషుల, మహిళల జట్లకు సమాన మ్యాచ్ ఫీజులు ఇస్తున్నారు.

## పెరిగిన మహిళా క్రికెటర్ల
# బ్రాండ్ విలువ




కొన్ని దశాబ్దాల నిరీక్షణకు తెర దించుతూ భారత మహిళల జట్టు వన్డే వరల్డ్ కప్‌ను కైవసం చేసుకుంది. హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలో విశ్వవిజేతగా నిలిచింది. ఈ విజయంతో భారత క్రికెటర్ల బ్రాండ్ వాల్యూ 25 నుంచి 100 శాతం వరకు అమాంతం పెరిగింది. అలాగే హర్మన్ ప్రీత్ కౌర్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ తదితరుల సోషల్ మీడియా అకౌంట్లకు ఒక్కసారిగా ఫాలోవర్లు పెరిగారు. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ముగిసి 24 గంటలు కాకముందే.. క్రికెటర్ల బ్రాండ్ వాల్యూ అమాంతం పెరిగింది. కొత్త ఎండార్స్‌మెంట్లే కాకుండా.. పాత వాటి పెంపు విషయమై కూడా చర్చలు జరిగినట్లు సమాచారం. జెమీమా రోడ్రిగ్స్.. ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో 127 పరుగులతో (134 బంతుల్లో, 14 ఫోర్లతో) నాటౌట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఆమె బ్రాండ్ వాల్యూ 100 శాతం వరకు పెరిగినట్లు తెలుస్తోంది. జెమీమా బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ఫీజు.. రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేస్తున్నట్లు సమాచారం. ఆమె.. రెడ్ బుల్, బోట్, సర్ఫ్‌ఎక్స్‌ఎల్‌కు ప్రచారకర్తగా వ్యవహరిస్తోంది. దేశంలో అత్యధిక పారితోషికం పొందుతున్న మహిళా క్రికెటర్ స్మృతి మంధాన. ఇప్పటికే ఆమె.. రెక్సోనా డియోడ్రెంట్, నైక్, హ్యుందాయ్, హెర్బాలైఫ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గల్ఫ్ ఆయిల్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ వంటి 16 బ్రాండ్‌లకు ప్రచారకర్తగా ఉంది. వీటి ద్వారా ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.1.5 నుంచి 2 కోట్ల వరకు సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా వరల్డ్ కప్ విజయంతో కొన్ని గంటల్లోనే టీమ్‌ఇండియా క్రికెటర్ల బ్రాండ్ వాల్యూ విపరీతంగా పెరిగింది.

## త్వరలో పెళ్లి బంధంలోకి స్మృతి అడుగు



ప్రపంచ ఛాంపియన్ స్మృతి మంధాన త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. స్మృతి తన ప్రియుడు పలాష్ ముచ్చల్ తో పెళ్లి చేసుకోనున్నారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ దాదాపు 6 సంవత్సరాలుగా ఒకరితో ఒకరు ఉన్నారు. భారతదేశం ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా పలాష్, స్మృతితో కనిపించారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వరల్డ్ కప్ ట్రోఫీతో ఫోటో దిగారు. ఈ జంట భారతదేశం సాధించిన విజయాన్ని కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు.పలాష్ తన చేతిపై స్మృతి మంధానా పేరుతో టాటూ కూడా వేయించుకున్నారు. పలాష్ తన సోషల్ మీడియాలో దీని ఫోటోను కూడా షేర్ చేశాడు.పలాష్ ముచ్చల్ సంగీత దర్శకుడు. పలాష్ సోదరి, గాయని పలక్ ముచ్చల్‌తో కూడా స్మృతి మంధానకు మంచి సంబంధం ఉంది. పలక్ ముచ్చల్ స్మృతి పుట్టినరోజున కలిసిన ఫోటో కూడా షేర్ చేసింది. పలాష్ 'తూ హి హై ఆషికీ', 'పార్టీ తో బనతీ హై' వంటి హిట్ పాటలపై వర్క్ చేశారు.స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ లవ్ స్టోరీ 2019లో ప్రారంభమైంది. పలాష్ తన సోదరి పలక్ ముచ్చల్ ముందు స్మృతికి ప్రపోజ్ చేశాడు, ఆమె కోసం చాలా అందమైన పాట కూడా పాడాడు.పలాష్ ముచ్చల్ స్మృతి మంధానతో తన సంబంధం గురించి జూలై 2024లో వెల్లడించాడు, అప్పుడు వారి సంబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. పలాష్ ఇటీవల మాట్లాడుతూ స్మృతి మంధానా త్వరలో ఇండోర్ కోడలు కాబోతోందని కూడా చెప్పాడు. ఆనంద బజార్ పత్రిక ప్రకారం, ఈ జంట వివాహం నవంబర్ 20, 2025 న జరగవచ్చు. వీరి వివాహం స్మృతి స్వస్థలమైన సాంగ్లీలో జరగవచ్చు.




## కలలు కనడం ఎప్పుడూ ఆపొద్దు
### హర్మన్ ప్రీత్ కౌర్

టీమ్‌ఇండియా మహిళల వన్డే వరల్డ్ కప్‌ను సొంతం చేసుకుని దశాబ్దాల నాటి కలను సాకారం చేసుకుంది. ఈ విజయంలో భారత జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ కీలకపాత్ర పోషించింది. ఫైనల్ పోరులో టీమ్‌ఇండియా దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా హర్మన్ ప్రీత్ బీసీసీఐ విడుదల చేసిన వీడియోలో యువతకు సలహా ఇచ్చింది. 'కలలు కనడం ఎప్పటికీ ఆపొద్దు' అని సూచించింది. అలాగే తన బాల్యాన్ని గుర్తు చేసుకుంది. బాల్యంలో తండ్రి క్రికెట్ బ్యాట్‌తో తాను ఆడుకున్న రోజుల గురించి చెప్పింది. 'నాకు ఊహ తెలిసినప్పటి నుంచి నా చేతిలో ఎప్పుడూ బ్యాట్ ఉండేది. అది మా నాన్నగారి క్రికెట్ కిట్‌లోది. అది చాలా పెద్దగా ఉండేది. ఒక రోజు మా నాన్న పాత బ్యాట్‌ను నా కోసం చిన్నగా చెక్కి ఇచ్చాడు. మేం దాంతో ఆడుకునేవాళ్లం. టీవీల్లో క్రికెట్ మ్యాచ్‌లు చూసినప్పుడల్లా.. ముఖ్యంగా టీమ్‌ఇండియా మ్యాచ్‌లు జరుగుతున్నప్పుడు నాకూ ఇలాంటి అవకాశం రావాలని అనుకున్నా. నిజానికి ఆ సమయంలో నాకు మహిళల క్రికెట్ గురించి కూడా పెద్దగా తెలియదు' అని హర్మన్ ప్రీత్ వివరించింది. 'టీమ్‌ఇండియాకు ఆడాలని నాకు కలగా ఉండేది. నేను అనుకున్నట్లుగానే భారత జట్టులో స్థానం సంపాదించుకున్నాను. అందుకే యువత కలలు కనడం ఆపొద్దు. అలాగే ప్రపంచకప్ గెలవాలని కల కన్నాను. అది కూడా సాకారమైంది. ప్రస్తుతం మేం ప్రపంచ ఛాంపియన్లుగా నిలిచాం. కొన్ని ఏళ్లుగా ఎదురుచూస్తున్న మా ఆశయం ఈ నాటికి నెరవేరినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ విషయంలో దేవుడికి కృతజ్ఞతలు' అని ఆమె పేర్కొంది. అలాగే 2017 ప్రపంచకప్ ఫైనల్‌లో ఓటమి తర్వాత తనకు ఎదురైన అనుభవాలను పంచుకున్నారు. '2017 ప్రపంచ కప్ ఫైనల్‌లో 9 పరుగులతో ఓడిపోయాం. దీంతో మేం చాలా బాధపడ్డాం. అది ఎలా జరిగిందో మాకు అర్థం కాలేదు. అయితే స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, భారత అభిమానుల నుంచి మాకు సాదర స్వాగతం లభించింది' అని కౌర్ అప్పటి విషయాలను గుర్తు చేసుకుంది. 'ప్రస్తుతం అందరి ప్రార్థనలు, ఆశీర్వాదం వల్లే మేం ఈ సారి వరల్డ్‌కప్ సాధించామని భావిస్తున్నా. కేవలం మేం మాత్రమే మ్యాచ్ ఆడామని అనుకోలేదు. భారత అభిమానులంతా మాతో కలిసి వరల్డ్ కప్ గెలిచారని భావిస్తున్నాం' అని పేర్కొన్నారు.

## ఐసీసీ మీటింగ్‌కు మొహ్సిన్ నఖ్వీ డుమ్మా

భారతదేశం ఆసియా కప్ 2025 విజేతగా నిలిచి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు టీమిండియాకు కప్ దక్కలేదు. ఈ విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ తీరు వివాదాస్పదంగా మారింది. భారత్ తరఫున బీసీసీఐ కప్ ఇవ్వాలని పదేపదే లేఖ రాసినా నఖ్వీ పట్టించుకోవట్లేదు. ఈ సమస్య ఇప్పుడు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో చర్చకు రానుంది. అయితే, ఈ మీటింగ్‌కు నఖ్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీసీఐ హెచ్చరికకు భయపడే ఆయన సమావేశాన్ని తప్పించుకుంటున్నారా అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం దుబాయ్‌లో ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కీలక సమావేశాలకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ హాజరు కావడం కష్టమని తెలుస్తోంది. దేశీయ రాజకీయ సమస్యల కారణంగానే నఖ్వీ దుబాయ్‌కు రాలేకపోతున్నారని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సమావేశంలో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అప్పగించడంలో ఆలస్యంపై అంశాన్ని లేవనెత్తే అవకాశం ఉంది. దీని వలన నఖ్వీపై ఒత్తిడి పెరగవచ్చని భావిస్తున్నారు. నఖ్వీ స్థానంలో బోర్డు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ సయ్యద్ ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో పాల్గొంటారు. నవంబర్ 7న జరగబోయే కీలక బోర్డు మీటింగ్‌లో కూడా సయ్యద్ పాకిస్తాన్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. నఖ్వీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనే ఛాన్స్ కూడా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ జరిగింది, కానీ కప్ మాత్రం ఇంకా విజేతలైన టీమిండియాకు అందలేదు.

## అండర్ 19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీ జట్టులో ద్రవిడ్ కుమారుడు



టీమ్‌ఇండియా క్రికెట్ లెజెండ్ రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ అండర్ 19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీ స్క్వాడ్‌లో స్థానం సంపాదించుకున్నాడు. ఈ టోర్నీ బుధవారం (నవంబర్ 5) నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. టాప్ ఆర్డర్ బ్యాటరైన అన్వయ్ టీమ్ 'సీ'లో ఆడనున్నాడు. అతడు విజయ్ మర్చంట్ ట్రోఫీ (అండర్ 16) గత సీజన్‌లో ఆరు మ్యాచుల్లో 91.80 యావరేజ్‌తో 459 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలున్నాయి. అలాగే ఇటీవల వినోద్ మన్కడ్ ట్రోఫీ (అండర్ 19)లో కర్ణాటక జట్టుకు సారథిగా వ్యవహరించాడు. బీసీసీఐ తెలిపిన వివరాల ప్రకారం.. 'హైదరాబాద్‌లో నవంబర్ 5 నుంచి 11 వరకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ మెన్స్ అండర్ 19 వన్డే ఛాలెంజర్ ట్రోఫీ జరగ నుంది. దీనికి సంబంధించిన నాలుగు (ఏ, బీ, సీ, డీ) జట్లను ఇప్పటికే జూనియర్ సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. అరోన్ జార్జ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న టీమ్ సీ, వేదాంత్ త్రివేది కెప్టెన్‌గా ఉన్న టీమ్ బీతో శుక్రవారం (నవంబర్ 6) తలపడనుంది. అన్వయ్ ద్రవిడ్ అన్న సమిత్ ద్రవిడ్ కూడా క్రికెటరే. అతడు మహారాజా టీ20 కేఎస్‌సీఏ ట్రోఫీలో కర్ణాటక తరఫున పాల్గొన్నాడు.




## హిందుజా గ్రూప్ ఛైర్మన్ కన్నుమూత

ప్రముఖ వ్యాపార సంస్థ హిందుజా గ్రూప్ ఛైర్మన్ గోపీచంద్ పి హిందుజా (85) కన్నుమూశారు. లండన్‌లో ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వ్యాపార వర్గాల్లో 'జీపీ'గా పేరొందిన ఆయన గత కొన్ని వారాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. లండన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచారు. హిందుజా కుటుంబంలో రెండో తరానికి చెందిన గోపీచంద్ 2023లో గ్రూప్ సంస్థలకు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన సోదరుడు శ్రీచంద్ మరణానంతరం ఆ బాధ్యతలు స్వీకరించారు. గోపీచంద్ హిందుజాకు భార్య సునీత, కుమారులు సంజయ్, ధీరజ్, కుమార్తె రీటా ఉన్నారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచే వ్యాపార రంగంలో ఉన్న హిందుజా గ్రూప్‌లోకి 1959లో గోపీచంద్ హిందూజా చేరారు. ఇండో- మిడిల్ ఈస్ట్ ట్రేడింగ్ ఆపరేషన్స్ నిర్వహించే సంస్థను అంతర్జాతీయ దిగ్గజ సంస్థల్లో ఒకటిగా నిలపడంలో ఆయన తనవంతు పాత్ర పోషించారు. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎనర్జీ, ఆటోమోటివ్, మీడియా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారాలను ప్రస్తుతం హిందూజా గ్రూప్ నిర్వహిస్తోంది. ముఖ్యంగా గల్ఫ్ ఆయిల్, అశోక్ లే ల్యాండ్ కొనుగోలు నిర్ణయాల్లో గోపీచంద్ కీలక భూమిక పోషించారు. బాంబేలోని జైహింద్ కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన గోపీచంద్.. యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్, రిచ్‌మండ్ కాలేజీ నుంచి న్యాయ, ఆర్థిక విభాగాల్లో డాక్టరేట్ డిగ్రీలు పొందారు.



## దేశంలోనే ధనిక జిల్లాగా రంగారెడ్డి

తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా తలసరి స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీపీ పర్ క్యాపిటా) పరంగా భారతదేశంలో అత్యంత ధనిక జిల్లాగా అవతరించింది. పట్టణ అభివృద్ధి, మెట్రోపాలిటన్ మౌలిక సదుపాయాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను ఎంతలా మార్చగలవో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ అని కొందరు భావిస్తున్నారు. కొన్ని సర్వేల్లో వెల్లడించిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా తలసరి జీడీపీ సుమారుగా రూ.11.46 లక్షలుగా ఉంది. ఇది భారతదేశంలో ఇతర జిల్లాల కంటే అత్యధికం కావడం గమనార్హం. గతంలో అగ్రస్థానంలో ఉన్న గురుగావ్ (హరియాణా), బెంగళూరు అర్బన్ (కర్ణాటక) వంటి జిల్లాలు కూడా రంగారెడ్డి కంటే ఈసారి వెనుకబడ్డాయి. అయితే తలసరి జీడీపీ జనాభాను బట్టి మారుతుంటుందని గమనించాలి.

## భారత్‌లోని కుబేరుల సంపద
# 23 ఏళ్లలో 62% వృద్ధి
### జీ20 నివేదిక

భారత్‌లో అత్యంత ధనవంతులైన ఒక శాతం కుబేరుల సంపద 23 ఏళ్లలో 62 శాతం పెరిగింది. జీ20 నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానతలు అత్యయిక పరిస్థితికి చేరాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఈ నివేదిక తయారీకి నోబెల్ గ్రహీత జోసఫ్ స్టిగ్లిట్జ్ నేతృత్వం వహించారు. 2000 నుంచి 2023 మధ్యకాలంలో యావత్ ప్రపంచం సృష్టించిన సంపదలో 41 శాతం అగ్రశ్రేణి, ఒక శాతం కుబేరుల వద్దే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. దిగువస్థాయిలో ఉన్న 50 శాతం మంది ఒక శాతం సంపదను పొందారని పేర్కొంది. ఈ అసమానతలను అత్యయిక పరిస్థితిగా అధ్యయనంలో పాల్గొన్న ఆర్థిక నిపుణులు అభివర్ణించారు. చైనా, భారత్ వంటి దేశాలు అభివృద్ధి మార్గంలో ఉండటం వల్ల ఆ దేశాల మధ్య అంతరాలు కాస్త తక్కువగా ఉన్నాయని, కానీ చాలా దేశాల్లో అసమానతలు పెరిగాయని వెల్లడించారు. ఈ అసమానతలను విస్మరించడం వల్ల కలిగే నష్టాలను నివేదికలో ఎత్తిచూపింది. తీవ్ర అసమానతలను ఎదుర్కొంటున్న దేశాలు ప్రజాస్వామ్య తిరోగమాన్ని చూసే అవకాశం ఏడు రెట్లు ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. 2.3 బిలియన్ల ప్రజలకు ఆహార భద్రత లేదని, వైద్య ఖర్చులు వంటివాటితో 1.3 బిలియన్ల ప్రజలు దారిద్ర్యంలోకి జారిపోయారని పేర్కొంది. కొందరి చేతుల్లోనే సంపద కేంద్రీకృతం కావడం సామాజికంగా జరుగుతోన్న అన్యాయం మాత్రమే కాదని, అది అస్థిరతకు దారితీస్తుందని హెచ్చరించింది. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు విధానపరమైన చర్యలు అవసరం అని స్పష్టంచేసింది.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న పెద్ది సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట చికిరి అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్ అని ట్వీట్ చేశారు. దానికి చికిరి చికిరి.. చరణ్‌గారు అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్ట్‌లు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. రాక్ స్టార్ సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో ఎవడే సుబ్రహ్మణ్యం సినిమాలో ఇదేరా అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు పెద్ది సినిమాతో తెలుగులో మళ్లీ పాడుతున్నారు. అయితే పెక్యులర్ వాయిస్ చికిరి పాటకు కొత్తదనం తీసుకొస్తుందని టీమ్ బలంగా నమ్ముతోంది.




## రింగు నాకు చాలా ఇంపార్టెంట్

నేషనల్ క్రష్ రష్మిక మందన్నత్వరలో 'ది గర్ల్‌ఫ్రెండ్' మూవీతో రాబోతుంది. దీంతో ప్రమోషన్స్‌లో ఫుల్ బిజీ అయిపోయిన ఆమె.. తాజాగా, జగపతి బాబు హోస్ట్ చేస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' షోలో పాల్గొంది. ఈ షోలో భాగంగా విజయ్ దేవరకొండతో ఎంగేజ్‌మెంట్ జరగడంపై స్పందించి క్లారిటీ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన ప్రోమో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో జగపతి బాబు.. రష్మికకు గాలి పిల్ల అనే నిక్‌నేమ్ పెట్టానని అంటాడు. దానికి రష్మిక నవ్వుతూ.. అయ్యయ్యో సార్ అంటుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ ఫ్రెండ్, విజయ్‌కి ఆల్‌టైమ్ ఫ్యాన్. మరి విజయం విజయ్ అంతా నీకే సొంతమా అనగా.. ఏమో అని అంటుంది. ఇక ఆమె పెట్టుకున్న రింగులు చాలా ఇంపార్టెంట్‌హా అని అడగ్గా.. అవును ఇవన్నీ నాకు చాలా ఇంపార్టెంట్ అని చెప్పడంతో అంతా గోల గోల చేస్తారు. ఇక చివర్లో ఎంగేజ్‌మెంట్ రింగ్ షాట్ ప్రోమోలో హైలెట్‌గా మారింది. ఈ షో ప్రోమో చూసిన వారంతా విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ నిజమేనని కంగ్రాట్స్ చెబుతున్నారు.




## రాజాసాబ్ సంక్రాంతికి రావడం పక్కా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ది హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకు న్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పుకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పుకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.


## దుల్కర్ సల్మాన్.. కాంత మూవీ

మాలీవుడ్ స్టార్ దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న సినిమా కాంత పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కు తున్న ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ పాన్ ఇండియా సినిమా నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన పోస్టర్, టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీని నవంబర్ 14న విడుదల చేస్తున్నారు. ఇటీవలే రేజ్ ఆఫ్ కాంత ట్రాక్‌ను విడుదల చేయగా సినిమాపై హైప్ క్రియేట్ చేస్తోంది. ఈ సాయంత్రం 4 గంటలకు తొలిమెరుపు ఉండబోతుందని నేడు కొత్త పోస్టర్ లాంచ్ చేశారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని రోల్స్‌తో డిజైన్ చేసిన పోస్టర్ నెట్టింట వైరల్ అవుతుండగా.. ఇంతకీ ఆ తొలి మెరుపు ఏంటనేది క్లారిటీ రానుంది. ఇప్పటికే కాంత మూవీ నుంచి అమ్మాడివే సాంగ్‌ను విడుదల చేశారని తెలిసిందే. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే కాంబోలో వచ్చే ఈ మెలోడీ ట్రాక్ మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తోంది. భారతీ-య సినిమాలో 1960ల నాటి గత యుగానికి నివాళిగా తెరకెక్కుతున్న కాంత సినిమాకు దుల్కర్ సల్మాన్‌తోపాటు టాలీవుడ్ యాక్టర్ రానా దగ్గుబాటి వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.




## థ్రిల్లర్ మూవీలో మీనాక్షి చౌదరి

ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో లాపతా లేడీస్ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.



## అలాంటి అవార్డులు మమ్ముట్టికి అవసరం లేదు : ప్రకాశ్‌రాజ్

జాతీయ అవార్డులపై నటుడు ప్రకాశ్‌రాజ్ ఘాటు వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా 55వ కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. వీటిని ప్రకటించిన అనంతరం ప్రెస్‌మీట్‌లో ప్రకాశ్ రాజ్ వైరల్ కామెంట్స్ చేశారు. "జాతీయ చలనచిత్ర అవార్డుల విషయంలో జ్యూరీ సభ్యులు రాజీ పడుతున్నారని చెప్పడానికి నేను భయపడను. కేరళ రాష్ట్ర అవార్డుల జ్యూరీ కమిటీకి నేను ఛైర్‌పర్సన్‌గా ఉండటం ఆనందంగా ఉంది. కేరళ కమిటీ వాళ్లు నాకు ఫోన్ చేసి.. అవార్డుల ఎంపిక కోసం అనుభవజ్ఞులైన బయటి వ్యక్తులు కావాలని అడిగారు. ఇందులో తాము జోక్యం చేసుకోబోమని వారు చెప్పారు. ఎలాంటి పక్షపాతం లేకుండా ఉండేందుకు వాళ్లు తీసుకున్న నిర్ణయం నచ్చి నేను అంగీకరించాను. అయితే, జాతీయ అవార్డుల విషయంలో అలా జరగట్లేదు. పక్షపాతంతో తీసుకునే నిర్ణయాల కారణంగా జాతీయ స్థాయిలో కొందరికి అవార్డులు అందుతున్నాయి. అలాంటి జ్యూరీ, అలాంటి ప్రభుత్వాలు ఉన్నప్పుడు.. మమ్ముట్టి లాంటి గొప్ప వ్యక్తులకు జాతీయ అవార్డులు అవసరం లేదు" అని ప్రకాశ్ రాజ్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఇక మమ్ముట్టి గతంలో మూడు సార్లు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు అందుకున్నారు. కానీ, ఆ తర్వాత ఆయన నటించిన ఎన్నో గొప్ప సినిమాలకు



అవార్డులు రాలేదని అభిమానులు నిరాశ వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా.. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన 'భ్రమయుగం'కు గాను ఉత్తమ నటుడిగా కేరళ రాష్ట్ర అవార్డును అందుకున్నారు. దీంతో రాష్ట్ర స్థాయిలో అత్యధిక సార్లు ఉత్తమ నటుడి విభాగంలో అవార్డు అందుకున్న నటుడిగా మమ్ముట్టి రికార్డు సృష్టించారు.

## పిఠాపురంలో..అలా మొదలయ్యింది

తొలి చిత్రం ప్రేయసి రావేతోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం పిఠాపురంలో. అలా మొదలైంది అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో పిఠాపురం అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం అని తెలిపారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com